
ఉమ్మడి జిల్లా వాసులు కోరుకుంటున్న వాటిలో ప్రధానమైనవి..

- వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు
- కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధికి చర్యలు
- గ్రేటర్ వరంగల్‌లో ఐటీ టవర్స్ నిర్మాణానికి కేటాయింపులు
- స్టేషన్‌ఘన్‌పూర్‌లో లెదర్‌పార్కు ఏర్పాటులో కదలిక
- మానుకోటలో ఉద్యానశాఖ యూనివర్సిటీ ఏర్పాటు
- జనగామ జిల్లా కల్లెం టెక్స్‌టైల్ పార్కు
- జయశంకర్ భూపాలపల్లిలో మైనింగ్, ఇంజనీరింగ్ కళాశాల నెలకొల్పడంపై ప్రకటన
- యూనెస్కో గుర్తింపు ఉన్న రామప్ప ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయింపు

నేటి రాష్ట్ర బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లా వాసుల ఆశలు

ఓరుగల్లుకు వరాలిచ్చేనా?



- సాగునీటి పథకాలకు ప్రాధాన్యం కోసం ఎదురుచూపు
- దేవాదుల సహా చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులకు నిధులిచ్చే అవకాశం
- కాంగ్రెస్ సర్కారు తొలి పద్దుపై ప్రజల్లో ఆసక్తి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

రాష్ట్ర ఆవిర్భావం జరిగిన తర్వాత తొలిసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ప్రవేశపెట్టబోతున్న తొలిబడ్జెట్‌పై ఓరుగల్లు వాసులు గంపెడాశలు పెట్టుకున్నారు. వరంగల్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా పర్యటించటంతో పాటు ఉమ్మడిజిల్లా, వరంగల్ నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధికి సంబంధించి అనేక హామీలు ఇచ్చారు. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట మేరకు గురువారం డిప్యూటీసీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో వరాలు కురిపిస్తారని, ఫలితంగా వరంగల్ మహానగరంతో పాటు మారుమూల ప్రాంతాలు అభివృద్ధిలో పరుగులు పెడతాయన్న ఆశతో ఉన్నారు. ఇక ఉమ్మడి వరంగల్ నుంచి 11మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండటం.. వారిలో కొండా సురేఖ, ధనసరి సీతక్క మంత్రులుగా ఉన్న నేపథ్యంలో ఉమ్మడిజిల్లాకు ప్రాధాన్యం దక్కుతుందని భావిస్తున్నారు. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాల్లో అభివృద్ధికి కావాల్సిన నిధులపై ప్రభుత్వానికి నివేదికలు కూడా ఇచ్చారు. దీంతో బడ్జెట్‌లో పరిశ్రమలు, విద్యాభివృద్ధి కార్యక్రమాలతో పాటు సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం దక్కబోతోందని ఎదురుచూస్తున్నారు.

నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీపై ఆశలు..

వరంగల్ నగర వాసులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య డ్రెయినేజీ. నాలాలన్నీ అక్రమణలకు గురి కావటంతో నగరంలో మురుగునీరు కాలనీలను ముంచెత్తుతోంది. వర్షాకాలమైతే కాలనీలన్నీ చెరువులను తలపిస్తాయి. 10లక్షలకు పైగా జనాభా, 1,500లకు పైగా కాలనీలు ఉన్నా మురుగు నీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవటంతో ఏటా వానాకాలంలో లోతట్టు ప్రాంతాలు మునుగుతున్నాయి. భారీ నిర్మాణాలతో నగరం కాంక్రీట్ జంగల్‌గా మారిపోగా.. అడ్డదిడ్డంగా నిర్మించిన ఇళ్లతో నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకపోవటంతో కష్టాలు తప్పటం లేదు. ఈ కష్టాలకు చెక్‌పెట్టేందుకు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీని నిర్మిస్తామని పార్లమెంట్ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇటీవల జరిగిన వరంగల్ అభివృద్ధి సమీక్షలోనూ చర్చించిన ఆయన డీపీఆర్‌ను రూపొందించి పంపించాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో సుమారు రూ.2వేల కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయని, దీంతో ఈ బడ్జెట్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీకి నిధులు వస్తాయన్న ఆశతో నగరవాసులున్నారు.



ప్రత్యేక ప్యాకేజీపై భారీ ఆశలు

ఈ బడ్జెట్‌లో వరంగల్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిస్తుందనే ఆశతో ప్రజలున్నారు. 2016-17లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం వరంగల్‌కు ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.250కోట్లు కేటాయించింది. ఈ నిధులతో నగరంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రతి ఏటా ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించిన గత ప్రభుత్వం ఆ తరువాత చేతులెత్తేసింది. హైదరాబాద్ తరువాత అతిపెద్ద నగరంగా ఉన్న వరంగల్ అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది. అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను తీర్చిదిద్దాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో వరంగల్‌కు ప్రత్యేక ప్యాకేజీ దక్కుతుందని భావిస్తున్నారు.



లెదర్ పార్కుకు నిధులొచ్చేనా?

చర్మకారులు, నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ కేంద్రంలోని శివునిపల్లిలో 117 ఎకరాల్లో రూ.275కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో లెదర్ పార్కును నిర్మించాలని ప్రతిపాదనలు చేసినా అవి అటకెక్కడంతో 2002లో టీడీపీ ప్రభుత్వం 25ఎకరాల్లో మినీ లెదర్ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేసి.. సుమారు రూ.10కోట్ల నిధులు కేటాయించారు. తొలి విడతలో స్థానికంగా ఆసక్తి ఉన్న 50మందికి చెన్నై లో చెప్పులు తయారు చేయటం, లెదర్ బ్యాగులు, ఇతర లెదర్ ఉత్పత్తుల తయారీపై శిక్షణ కూడా ఇప్పించారు. 2003 లో రూ.10లక్షలతో లెదర్ పరిశ్రమ కోసం ఓ భవనం కూడా నిర్మించారు. మరో రెండు విడతల్లో 120మందికిపైగా శిక్షణ ఇచ్చా రు. అయినా ఇప్పటి వరకు లెదర్ పార్కుకు మోక్షం లేదు. ఇటీవల స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి లెదర్ పార్కు అభివృద్ధిపై సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ బడ్జెట్‌లో లెదర్ పార్కుకు మోక్షం లభిస్తుందనే ఆశతో స్థానికులున్నారు.

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు నిధులు..

వరంగల్ జిల్లా గీసుగొండ మండలం శాయంపేజ శివారులో 1,350 ఎకరాల్లో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ) పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఐదు లక్షమందికి పైగా ఉపాధి అవకాశాలు లభించేవి. ప్రభుత్వంతో 22కంపెనీలు ఒ ప్పందం కుదుర్చుకు న్నప్పటికి కేవలం మూడు కంపెనీలు మాత్రమే ప్రస్తుతం ఉత్పత్తి ప్రారంభించాయి. అయితే 18 మార్చి 2023న కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పీఎం మిత్ర పథకంలో వరంగల్ టెక్స్‌టైల్ పార్కును చేర్చేందుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేయ టం లేదు. కేంద్ర బడ్జెట్‌లో కూడా ఎలాంటి నిధులు కేటాయించలేదు. గత నెల 29న వరంగల్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఈ పార్కును సందర్శించారు. ఆయన ఇచ్చిన ఆదేశాలతో అధికారులు కొత్త పరిశ్రమల ఏర్పాటుకు సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర బడ్జెట్‌లో కేఎంటీపీకి భారీగా నిధులు కేటాయిస్తారనే ఆశతో ఓరుగల్లువాసులున్నారు.

సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం..

ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇచ్చేందుకు కసరత్తు చేసిందని, రూ.1,000కోట్ల లోపు బడ్జెట్‌తో పూర్తి అయ్యే ప్రాజెక్టులను గుర్తించి 2025 మార్చిలోపు వాటిని పూర్తి చేయాలని నిర్ణయానికి వచ్చిందని సమాచారం. వీటిలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని దేవాదుల ప్రాజె క్టుకు తొలి ప్రాధాన్యమి వ్వాలని భావిస్తోంది. ఇప్పటికే ఫేస్-1, ఫేస్-2 పనులు పూర్తవగా

మిగతా 7వ పేజీలో..

రేపు మేడిగడ్డ, కన్నెపల్లికి బీఆర్ఎస్ బృందం

- కేటీఆర్, హరీశ్‌రావు సహా ఎమ్మెల్యేలు, నేతల రాక

కాటారం (మహదేవపూర్ రూరల్), జూలై 24: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల పరిధిలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌస్‌లను పరిశీలించేందుకు బీఆర్ఎస్ బృందం శుక్రవారం రానుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులు రానున్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. ఉదయం 9గంటలకు కన్నెపల్లి పంప్‌హౌస్‌కు నేతలు చేరుకుంటారు. అనంతరం 10.30గంటలకు మీడియాతో మాట్లాడతారు. 11.30గంటలకు మేడిగడ్డ బ్యారేజీ చేరుకుంటుంది. అక్కడి నుంచి బయల్దేరి మంచిర్యాల జిల్లా చెన్నూరుకు వెళ్తారు.

మహిళా క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు

- మేయర్ గుండు సుధారాణి


వరంగల్ కార్పొరేషన్, జూలై 24 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్‌ల నిర్వాహణపై మెప్మా అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అధికా రులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడారు. మహిళల ఆర్థికాభివృద్ధికి దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇందిరమ్మ మహిళా శక్తి కార్యక్రమాన్ని ప్రారంభించిందని స్వయం సహాయక మహిళా సంఘాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలను ప్రోత్సహించేందుకు ఫుడ్ ప్రాసెసింగ్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అదే విధంగా క్యాంటీన్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. బల్దియా వ్యాప్తంగా ప్రధాన కార్యాలయంతో పాటు రెండు సర్కిళ్లలో 5 క్యాంటీన్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. తొలి దశంలో భాగంగా 30 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు సీవోలు సభ్యులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. నగరంలో ఉత్పత్తులకు శిక్షణ అందించేందుకు శాశ్వత కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. టీపీఆర్వో కోల రాజేశ్, టీఎంసీ రమేష్, సీవోలు రమేష్, శ్రీలత, అలీ, రాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు.



మెప్మా అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

బల్దియా బదిలీల్లో అవకతవకలు

- తెరవెనుక చక్రం తిప్పిందెవరు?
- సీడీఎంఏను కలిసిన కొందరు ఉద్యోగులు
- ప్రక్రియలో అక్రమాలు జరిగినట్టు అనుమానాలు
- బదిలీ అయినా ఇంకా కదలని కొందరు సిబ్బంది



వరంగల్ కార్పొరేషన్, జూలై 24 : రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం (ఆర్‌డీఎంఏ) పరిధిలో ఇటీవల జరిగిన బల్దియా సీనియర్ అసిస్టెంట్ల బదిలీలలో అవకతవకలు జరిగాయా? అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం జీవో80 ప్రకారం మూడేళ్లు ఒకే చోట విధులు నిర్వర్తించిన వారికి స్థానచలనం కల్పించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. కానీ వరంగల్ బల్దియా, ఆర్‌డీఎంఏ కార్యాలయంలో అధికారులు జీవోను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా ఎవరికి తోచిన విధంగా వారు బదిలీలు చేసినట్టు తెలుస్తోంది. కొందరు సీనియర్ అసిస్టెంట్లు బల్దియా ప్రధాన కార్యాలయంతో పాటు కాజీపేట, కాశిబుగ్గ సర్కిల్‌లో మూడు నుంచి ఐదు సంవత్సరాల పాటు ఒకే చోట తిష్ట వేసిన వారిని బదిలీ చేయకుండా బైపాస్ సర్జరీ, అనారోగ్యం సమస్యలున్న వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేసి వారి డొల్లతనాన్ని బయటపెట్టారు. అధికారులు చేసిన బదిలీలో ఏ మాత్రం పారదర్శకత లేదని కొందరు ఉద్యోగులు మండి పడుతున్నారు. అయితే కొందరు సెక్షన్ అధికారులకు, సిబ్బందికి ముడుపులు అప్పగించడంతో పాటు రాజకీయ పలుకుబడితో బదిలీలను నిలిపివేసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. వందలో 40 శాతం మందిని బదిలీ చేయాల్సి ఉండగా ప్రభుత్వ నిబంధనలు పక్కన పెట్టి ఎక్కడ ఖాళీలు లేవనే సాకుతో తమకు నచ్చిన వారిని ఇక్కడే ఆపేసి నచ్చని వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేసినట్టు ప్రచారం జరుగుతోంది.

ప్రభుత్వ జీవో 80 ప్రకారం క్యాన్సర్, కాలేయ, మూత్రపిండాల మార్పిడి ఆపరేషన్లు జరిగిన వారు, ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్న వారు, వితంతువులు, మానసిక సమస్యలతో ఉన్న పిల్లల తల్లిదండ్రులతో పాటు ప్రభుత్వ గుర్తింపు సంఘాలలో యాక్టివ్‌గా పని చేస్తున్న వారికి బదిలీ చేయకూడదనే నిబంధన ఉంది. కానీ బల్దియాలో పని చేస్తున్న ఇజ్రాయెల్‌కు బైపాస్ సర్జరీ అయింది. అయినా ఆ ఉద్యోగిని బదిలీ చేయడంతో అధికారులు తీరుపై ఉద్యోగులు మండి పడుతున్నారు. అంతే కాకుండా ఇజ్రాయెల్‌కు మరో రెండు సంవత్సరాల్లో ఉద్యోగ విరమణ ఉన్నా సీనియర్ అసిస్టెంట్‌ను ఖమ్మం మున్సిపాలిటీకి బదిలీ చేయడంతో సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బైపాస్ సర్జరీ అయిన ఉద్యోగికి ఖమ్మం బదిలీ!

సీనియారిటీ పాటించని అధికారులు..

బల్దియాలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్లకు ఈ నెల 20న ఆర్‌డీఎంఏ కేంద్రంగా బదిలీలు జరిగిన విషయం తెలిసిందే. కాగా, సీనియారిటీ ప్రకారం బదిలీలు చేయకుండా అడ్డదిడ్డంగా బదిలీలు జరిగినట్టు తెలుస్తోంది. బదిలీల కోసం అర్హులైన 22మంది ఉద్యోగులు సర్వీస్ బుక్‌తో పాటు పూర్తి బయోడేటాతో అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో బొట్ల రమేష్ తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ సంఘం నాయకుడిగా గుర్తింపు కలిగి బదిలీ నుంచి బయటపడ్డారు. కానీ ఆ తర్వాత పేరు ఉన్న దన్‌రాజ్‌ను కానీ నాలుగో నెంబర్‌లో ఉన్న లింగమూర్తితో పాటు మిగతా సీనియర్ అసిస్టెంట్లను బదిలీ చేయకుండా గుండె ఆపరేషన్ చేసుకున్న కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయంలో పని చేస్తున్న ఇజ్రాయెల్‌ను ఖమ్మం బల్దియాకు బదిలీ చేయడంతో ఇక్కడి అధికారులపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఇదంతా మున్సిపల్ ఉన్నతాధికారులకు తప్పుదోడ పట్టించి బదిలీల ప్రక్రియ నిర్వహించినట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతే కాకుండా

మిగతా 8వ పేజీలో..

350 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చెన్నారావుపేట, జూలై 24 : మండలంలోని ఉప్పరపల్లిలో ఓ రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ బుధవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పెరుమాండ్ల శ్రీధర్‌రెడ్డి తన సాయిరాం బిన్ని రైస్‌మిల్లులో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు మిల్లులో దాడులు నిర్వహించారు.

ఈ దాడుల్లో రూ. 9 .10 లక్షల విలువైన 350క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మిల్లు యజమాని రేషన్ బియ్యాన్ని చుట్టు పక్కల గ్రామాల్లో, ఇతర ప్రాంతాలకు ఎక్కువ ధరకు అమ్మకాలు చేస్తున్నాడు. కాగా, పట్టుకున్న రేషన్ బియ్యాన్ని చెన్నారావుపేట పోలీసులకు అప్పగించారు. మిల్లు యజమాని పెరుమాండ్ల శ్రీధర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఎస్సై రాజు, ఏఎస్సై లక్ష్మణమూర్తి, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



రేషన్ బియ్యాన్ని చూపుతున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

వన మహోత్సవంలో జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్ కలెక్టరేట్, జూలై 24: వన మహోత్సవంలో జిల్లాను ప్రథమస్థానంలో నిలిపేందుకు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో వన మహోత్సవ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా టార్గెట్ 25.58 లక్షల మొక్కలు నాటే లక్ష్యం కాగా ఇప్పటి వరకు 16 లక్షల 17వేల మొక్కలు నాటడం జరిగిందని, మిగిలిన లక్ష్యాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలోని రహదారుల వెంబడి ఆకర్షణీయమైన అవెన్యూ ప్లాంటేషన్‌తోపాటు ఈత, ఖర్జూర, జామ, ఇతర పండ్ల మొక్కలు, కిచెన్ గార్డెన్, కరివేప, నిమ్మ, చింత తదితర మొక్కలను ఎంచుకోవాలన్నారు. మెడిసిన్ గార్డెన్ కింద అలోవెరా, గోరింటాకు, తులసి, కృష్ణతులసి వనం తదితర మొక్కలను ఎంచుకొని ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేసినట్లయితే పిల్లలకు ఆరోగ్య రీత్యా ఉపయోగకరంగా ఉంటన్నారు. బోగేన్విలియా, అలోవెరా లాంటి మొక్కలు ప్రతి పాఠశాల, హాస్టల్‌లో పెంచేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. జిల్లాలో శ్రీగంధం, కొబ్బరి తదితర మొక్కలు పెంచేందుకు ప్రోత్సహించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

నాటిన ప్రతి మొక్క, మొక్క పేరు ప్లకార్డుపై రాసి మొక్క పక్కన ఏర్పాటు చేసి సెల్ఫీ తీసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన వారిలో ఉత్తములను ఎంపిక చేసి అవార్డు ప్రదానం చేస్తామని తెలిపారు. ప్రజలందరూ వారి ఇంటి చుట్టుపక్కల మొక్కలు నాటి సెల్ఫీ తీసి అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జిల్లా వ్యవసాయాధికారి ఉషా దయాల్, డీఈవో వాసంతి, ఫారెస్ట్ సూపరింటెండెంట్ సదానందం, మెప్మా పీడీ రేణుక తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఇన్‌స్పైర్ మనక్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

ఆయిల్‌పామ్ సాగుకు ఎంతో భవిష్యత్తు

భద్రాద్రి జిల్లా స్ఫూర్తితో ఇతర జిల్లాల్లో విస్తరణ : ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

అశ్వారావుపేట, జూలై 24: రాష్ట్రంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పామాయిల్ సాగును రికార్డు స్థాయిలో చేయడం ద్వారా హబ్‌గా మారిందని ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ప్రశంసించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట, దమ్మపేట పామాయిల్ ఫ్యాక్టరీలను సందర్శించారు. ఆయా ఫ్యాక్టరీలు పనిచేసే విధానం, క్రషింగ్, ఆయిల్ రికవరీ, ఫ్యాక్టరీల కండీషన్, ఉప ఉత్పత్తులు, ఇతర సాంకేతిక వివరాలను ఆయిల్‌ఫెడ్ అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాద్రి జిల్లా ఆయిల్‌పామ్ సాగు అనుభవాలతో వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ జరగాల్సి ఉందని అన్నారు.

ఆయిల్‌పామ్ తూకం వేసే వే బ్రిడ్జి వద్ద, ఆన్‌లైన్ బిల్లు ప్రాసెస్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి మోసాలకు తావులేకుండా చూడాలని కోరారు. దేశానికి ఏడాది కోటి టన్నుల పామాయిల్ అవసరం వుందని, కానీ మూడు లక్షల టన్నులే అందు బాటులో వుందని మిగతాది మలేషియా, ఇండోనేషియా వంటి ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్టు రాఘవరెడ్డి తెలిపారు. ఆయిల్‌ఫెడ్ అధికారులు నిరంతరం రైతులకు అందు బాటులో ఉండి వారి సందేహాలు తీర్చాలని సూచించారు. తెలంగాణలోని భూములు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నందున ఆయిల్‌ఫెడ్ ద్వారా రైతులు ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అనంతరం నారవారిగూడెంలోని ఆయిల్‌ఫెడ్ డివిజన్ కార్యాలయం, నర్సరీలను సందర్శించారు. రాయితీలు వస్తున్నాయా? ఈ ఏడాది ఎన్ని ఎకరాల్లో మొక్కలు వేశారనే విషయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ పి.సుధాకరరెడ్డి, డివిజనల్ మేనేజర్ ఆకుల బాలకృష్ణ పాల్గొన్నారు.



ఫ్యాక్టరీని సందర్శించిన జంగా రాఘవరెడ్డి, అధికారులు

'ఎదుగుదలను ఓర్వలేకే కుట్రలు'

వరంగల్ కార్పొరేషన్, జూలై 24 : సీపీఎం పార్టీలో తన ఎదుగుదలను ఓర్చుకోలేక కొందరు కాంగ్రెస్ పార్టీ కింది స్థాయి నాయకులు కుట్రలు చేస్తూ తమ కాలనీలలో కొందరిని పార్టీలో చేర్చుకుని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని గ్రేటర్ 2వ డివిజన్ భగత్‌సింగ్ కాలనీ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద మల్లేశం అన్నారు. బుధవారం భగత్‌సింగ్ కాలనీలో స్థానిక సీపీఎం కార్యకర్తలతో కలిసి విలేకరులతో మాట్లాడారు.

పెద్దమ్మతల్లి దేవాలయంలో చోరీ

అమ్మవారి అభరణాలు ఎత్తుకెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు

ధర్మసాగర్, జూలై 24: పెద్దమ్మతల్లి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన పెద్ద పెండ్యాలలో జరిగింది. ధర్మసాగర్ సీఐ మహేందర్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపెండ్యాలలోని పెద్దమ్మ తల్లి దేవాలయంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పిట్టల ఆశోక్ రోజూ మాదిరిగా పెద్దమ్మ తల్లి గుడిని శుభ్రం చేసి మంగళవారం రాత్రి 8.30 గంటలకు తాళం చేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం ఉత్సవ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు ఆశోక్ వద్ద నుంచి గుడికి సంబంధించిన తాళాన్ని తీసుకుని గుడి వద్దకు వెళ్లి చూసే సరికి గుడి ఇనుపగేట్‌కు వేసిన తాళం పగులగొట్టి ఉంది. దీంతో వెంకటేశ్వర్లు విషయాన్ని ఆశోక్‌కు చెప్పడంతో గుడిలోనికి వెళ్లి చూడగా అమ్మ వారి మెడలో గల రెండు బంగారు పుస్తెలు, ముక్కు పుడుక, నాలుగు వెండి మట్టెలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు 67,400 వరకు ఉంటుందన్నారు. సంఘటనా స్థలాన్ని కాజీపేట ఏసీపీ తిరుమల్‌రావు, సీఐ మహేందర్‌లు సందర్శించి వివరాలను కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలల ప్రతిష్టను పెంపొందించే బాధ్యత ఉపాధ్యాయులదే : డీఈవో

ఐనవోలు, జూలై 24: ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్టను పెంపొందించే బాధ్యత ఉపాధ్యాయులదేనని హనుమకొండ డీఈవో వాసంతి అన్నారు. ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ విద్యా సంవత్సరానికి విద్యార్థుల నమోదు ఏలా ఉంది, విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసే దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పుస్తకాల వివరాలను, మధ్యాహ్నం భోజనం మెనూ ప్రకారం పంపిణీ చేస్తున్నారా, ఎఫ్ఎల్ఎన్ ఉన్నతి లక్ష్యం, కార్యక్రమాల ద్వారా విద్యార్థులతో కనీస అభ్యసన సామార్థ్యాలు ఎంత మేరకు వృద్ధి చెందాయి లాంటి విషయాలు హెచ్ఎం ప్రతాప్‌రత్నకుమార్‌ని అడిగితెలుసుకున్నారు. విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరని చెప్పడంతో ప్రస్తుతానికి కావాల్సిన ఉపాధ్యాయులను వెంటనే నియమిస్తామని డీఈవో హామీ ఇచ్చారు. గడిచిన సంవత్సరాల్లో 10వ తరగతి 100శాతం ఫలితాలు సాధించడంతోపాటు, ఎన్ఎంఎంఎస్ లాంటి జాతీయ స్థాయి పరీక్షల్లో ఏడుగురు విద్యార్థులు అర్హత సాధించడం గొప్ప విషయమన్నారు. ఈ పాఠశాలలో అందరు ఎస్జీటీ ఉపాధ్యాయులైనప్పటికీ 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉపాధ్యాయుల బోధన బాగుందని కొనియాడారు.

గుర్తింపు సరే.. అభివృద్ధి ఏదీ?

- అరుదైన ఖ్యాతి గడించి మూడేళ్లయినా మారని రామప్ప పరిస్థితి
- ప్రత్యేక దృష్టి పెట్టాలంటున్న పర్యాటకులు
- రామప్పకు యునెస్కో గుర్తింపు దక్కి మూడేళ్లు



సోమసూత్రం పని చేయకపోవడంతో నీటిని బిందెలతో బయటకు పంపిస్తున్న దృశ్యం (ఫైల్)



వర్షానికి తడుస్తున్న నందీశ్వరుడు



రామప్ప దేవాలయం



సక్షాసన ప్రదేశంలో పడుతున్న వాన నీరు

వెంకటాపూర్(రామప్ప), జూలై 24: కాకతీయ కళా వైభవానికి ప్రతీకగా నిలిచి.. ప్రపంచ వారసత్వ సంపదగా వరల్డ్ హెరిటేజ్ కమిటీ (యునెస్కో) గుర్తింపు సాధించిన ములుగు జిల్లాలోని రామప్ప రామలింగేశ్వరస్వామి ఆలయం అభివృద్ధిలో వెనుబాటుకు గురవుతూనే ఉంది. అరుదైన ఖ్యాతి గడించి మూడేళ్లయినా దేవాలయ పరిస్థితిలో మాత్రం మార్పు రాలేదు. 2021 జూలై 25న ప్రపంచ వారసత్వ సంపదగా వరల్డ్ హెరిటేజ్ కమిటీ రామప్పను గుర్తించింది. ప్రపంచవ్యాప్తంగా 42 వారసత్వ కట్టడాలు యునెస్కో పరిశీలనకు ఎంపిక కాగా మన దేశం నుంచి 2020 సంవత్సరానికి రామప్పకు మాత్రమే ఈ ఖ్యాతి దక్కింది. తెలుగు రాష్ట్రాల్లో వారసత్వ గుర్తింపు పొందిన తొలి కట్టడంగా రామప్ప రికార్డు సృష్టించింది. చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద, జలపాతాలు క్రీస్తుపూర్వం నుంచి తెలంగాణలో ఎన్నో ఉన్నా యునెస్కో గుర్తింపు పొందిన వారసత్వ సంపద జాబితాలో తెలంగాణ రాష్ట్రం నుంచి రామప్ప 39వ ప్రపంచ వారసత్వ కట్టడంగా ఎంపికైంది. రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు వచ్చి మూడేళ్లలో జరిగిన అభివృద్ధి, ఇంకా చేయాల్సిన పనులపై ప్రత్యేక కథనం...

భారతదేశంలో సుమారు 3,600 చారిత్రక కట్టడాలు ఉన్నాయి. అంతర్జాతీయ సంస్థ (యునెస్కో) ఈ తరహా కట్టడాలకు గుర్తింపునిస్తోంది. 2021 వరకు రామప్ప సహా 39 కట్టడాలకు మాత్రమే అంతర్జాతీయ స్థాయి గుర్తింపు ఇచ్చారు. యునెస్కో గుర్తింపు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు రామప్ప పరిరక్షణ కమిటీ తీవ్రంగా కృషి చేసింది. ఈ క్రమంలో 2017లో తొలి డోజర్‌ను ప్యారిస్‌లోని యునెస్కో కార్యాలయానికి పంపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు కాకతీయ హెరిటేజ్ సైట్ హైదరాబాద్‌కు చెందిన సీనియర్ ఆర్కిటెక్ సూర్యనారాయణమూర్తితో తయారు చేయించి అప్పటి కేంద్ర పురావస్తుశాఖ డైరెక్టర్ ఆఫ్ జనరల్ (డీజీ) విద్యావతి ఆధ్వర్యంలో పంపించారు. దీని ఆధారంగా 27 డిసెంబరు 2019లో థాయిలాండ్ దేశానికి చెందిన యునెస్కో ప్రతినిధి వాసుపోశ్యా నందన సందర్శించారు. వరుసగా రెండు రోజులు రామప్పలో మకాం వేసి రామప్ప యునెస్కో గుర్తింపు ఎంపికకు కావాల్సిన సూచనలు తయారు చేస ప్రగతి నివేదికను ప్యారిస్‌లోని యునెస్కో కార్యాలయంలో సమర్పించారు. అప్పటి నుంచి రామప్పకు యునెస్కో గుర్తింపు వచ్చిందనే ఆశతో రామప్పలో సంబరాలు జరుపుకున్నారు.

యునెస్కో ప్రతినిధి ఇచ్చిన సూచనలు ఇవే...

రామప్పకు యునెస్కో గుర్తింపు రావడానికి వాసుపోశ్యానందన పలు సూచనలు చేశారు. రామప్ప ప్రధాన ఆలయానికి సమీపంలో ఉన్న కామేశ్వరాలయాన్ని పునర్నిర్మాణం చేయాలని, ఆలాగే ప్రధాన ఆలయం చుట్టుపక్కల ఉన్న గోల్లాలగుడి, శివాలయాలను ఒకే కాంప్లెక్స్‌లో ఉండేలా తయారు చేయాలని సూచించారు. అలాగే 100 మీటర్ల దూరం వరకు కోర్ ఏరియాగా గుర్తించాలని, 101 నుంచి 200 మీటర్ల వరకు క్రమబద్ధీకరించి పర్యాటకులను ఆకర్షించేలా కట్టడాలు నిర్మించాలని అన్నారు. అంతే కాకుండా 201 నుంచి 500 మీటర్ల వరకు బఫర్‌జోన్ ఏర్పాటు చేసి పాలంపేట స్పెషల్ డెవలప్‌మెంట్ అథారిటీ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు.

రాష్ట్రపతి రాక..

రాష్ట్రపతి ద్రౌపదిముర్ము 2022 డిసెంబర్ 29న తొలిసారిగా రామప్ప ఆలయాన్ని సందర్శించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, అప్పటి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి, ప్రస్తుత గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి, అప్పటి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కూడా పర్యటించారు. అంతేకాకుండా అప్పటి సుప్రీంకోర్టు జడ్జి రమణ రామప్ప కళా సంపదను చూసి అబ్బురపడ్డారు. అప్పటి రాష్ట్ర మంత్రి కేటీఆర్ కూడా రామప్పను సందర్శించారు. గతేడాదిలో కాంగ్రెస్‌పార్టీ రోడ్‌షోలో భాగంగా కాంగ్రెస్‌పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ కూడా రామప్పను సందర్శించి ప్రశంసించారు. యునెస్కో గుర్తింపుతో మారుమూల పల్లె పాలంపేట అంతర్జాతీయ స్థాయిలో చోటు సంపాదించుకోవడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

ప్రపంచ గుర్తింపు వచ్చాక...

రామప్పకు యునెస్కో గుర్తింపు వచ్చాక రూ. 11కోట్లతో కామేశ్వర ఆలయం పునర్నిర్మాణం చేయాలని ఆదేశాలు వచ్చాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు సాగడంలేదు. రూ.25లక్షలతో గార్డెన్ సుందరీకణ, రూ.30లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణం, రూ 2కోట్లతో మౌలిక వసతులు, అంతర్జాతీయస్థాయి మరుగుదొడ్ల నిర్మాణం, దివ్యాంగుల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు, చంటి పిల్లల కోసం ప్రత్యేక వసతులు, సోలార్ లైట్ల ఏర్పాటు, క్యాంటీన్ల ఏర్పాటు, సూచిక బోర్డుల ఏర్పాటు, చెవిటి,మూగ వారి కోసం క్యూఆర్ కోడ్‌ల ఏర్పాటు, 2018లో తూర్పు ప్రాకార గోడ కూలిపోవడంతో రూ.40లక్షలతో తూర్పు ప్రాకార గోడ పునర్నిర్మాణం చేశారు. రూ. 35లక్షలతో దక్షిణ ప్రాకారగోడ కూలడానికి సిద్ధంగా ఉండటంతో 2022 డిసెంబరులో తొలగించి 2023లో పునర్నిర్మాణం చేశారు. 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దృష్టిలో ఉంచుకుని రామప్ప ఆలయం చుట్టూ మూడు రంగుల జెండాతో కూడిన ఎల్ఈడీ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఆలాగే నార్త్, ఈస్ట్ ప్రాకారగోడల నిర్మాణం కోసం రూ.35 లక్షలతో టెండర్ పిలువగా టెండర్ దక్కించుకున్న వ్యక్తి రాకపోవడంతో ఆ పనులు పూర్తికాలేదు.

మూడేళ్లయినా అభివృద్ధి శూన్యం

ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు వచ్చి ఇప్పటికీ మూడు సంవత్సరాలైనా అభివృద్ధి మాత్రం జరగడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కామేశ్వరాలయం పునర్నిర్మాణం, ఉప ఆలయాలపై పట్టింపులేనితనం, తూర్పు ముఖ ద్వారం చీకటిమయం, సెంట్రల్ లైటింగ్ వెలుగులులేవు, శివలింగానికి చిలకరింపు అభిషేకాలే. సోమ సూత్రంపై నీలినీడలు, ఆలయం ఉరుస్తున్నా పట్టించుకోకపోవడం, నందీశ్వరుడిపై నీడలేదు, ఆలయం చుట్టూ సరిగా ఫెన్సింగ్ లేదు. సరస్సుపై మినీట్యాంక్‌బండ్ లేకపోవడం, కట్టపై ఉన్న ఉప ఆలయాలపై పట్టింపులేదు వంటి సమస్యలు ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. రానున్న రోజుల్లో రామప్పను అభివృద్ధి చేసి మరింత శోభాయమానంగా విరాజిల్లేలా అధికారులు చొరవ చూపాలని పర్యాటకులు, భక్తులు కోరుతున్నారు.

యునెస్కో గుర్తింపు పొందిన వారసత్వ సంపదపై చిన్నచూపు

ప్రసాద్ స్కీంలో రూ.62కోట్లతో పనులు

ప్రపంచ వారసత్వ సంపద అయిన సుప్రసిద్ధ రామప్ప దేవాలయానికి తూర్పుముఖ ద్వారం సమీపంలో ప్రసాద్‌స్కీం కింద రూ. 62కోట్లతో 22-12-2022లో నిధులు మంజూరు కాగా, అదే నెల 29న భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, అప్పటి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్, స్థానిక ఎమ్మెల్యే ప్రస్తుత మంత్రి ధనసరి సీతక్కతో కలిసి రామప్పను సందర్శించారు. అనంతరం ప్రసాద్‌స్కీంలో వచ్చిన పనులకు రాష్ట్రపతి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఆ పనులు కొనసాగుతున్నాయి. సైట్ ఏలో పదెకరాల్లో ఇంటర్‌పిటిషన్ సెంటర్ జీ1, ఫుడ్‌కోర్టు విత్ గ్లాస్, సావనీర్‌స్టాల్స్ విత్ ఆర్నమెంటల్, టాయిలెట్స్ బ్లాక్స్, సెక్యూరిటీ క్యాబిన్, కాంపౌండ్‌వాల్, ఆలాగే సైట్ బిలో 9 ఎకరాల్లో టికెట్ కౌంటర్, కాంపౌండ్ వాల్, గ్రావెల్ ఫిల్లింగ్స్, మినీథియేటర్ తదితర నిర్మాణాలు చేపడుతున్నారు. ఈనిర్మాణాలను 2024 డిసెంబరులోగా పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేసినట్లు టూరిజం అధికారులు తెలిపారు.

జేఎన్ఎస్‌ను సందర్శించిన 'సాట్' డైరెక్టర్



జేఎన్ఎస్‌లోని సింథటిక్‌ట్రాక్‌ను పరిశీలిస్తున్న సాట్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మి

వరంగల్ స్పోర్ట్స్, జూలై 24 : హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)ను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి ఐఏఎస్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేడియంలోని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన అథ్లెటిక్స్ సింథటిక్ ట్రాక్‌ను పరిశీలించారు. అనంతరం జిల్లా క్రీడల అధికారి అశోక్‌కుమార్‌తో కలిసి హాస్టల్ నిర్వాహణ, మౌలిక వసతులతో పాటు ఇతర క్రీడా అంశాల గురించి అరా తీశారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం తరువాత పెద్ద నగరంగా పేరు గాంచిన హనుమకొండలో అతి పెద్ద స్టేడియం ఉందని, ఇక్కడ సీనియర్ కోచ్‌లో అందుబాటలో ఉండడం అభినందనీయమన్నారు. అదే విధంగా రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ఉండే బాల బాలికలకు నూతన వసతి గృహం నిర్మాణంతో పాటు క్రీడా వసతులకు గాను రూ. 14 కోట్ల నిధులను అందించాలని సాట్‌కు ప్రతి పాదనలు పంపించామన్నారు. అంతకు ముందు వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగస్టు 1న మానుకోటకు 'వాల్యూగోల్డ్'

- రాష్ట్రంలోనే మొట్టమొదటి బంగారం కొనుగోలు వాహనం



వరంగల్‌లో వాల్యూగోల్డ్ ప్రచారంలో పాల్గొన్న గంగవ్వ, సంస్థ ప్రతినిధులు

మహబూబాబాద్ టౌన్, జూలై 24 : మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి బంగారం కొనుగోలు చేసే వాహనం ఆగస్టు 1న రానున్నట్లు వాల్యూ గోల్డ్ సీఈవో భరద్వాజ్ పంపత్వార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా బంగారం కొనుగోలుచేసే వాహనం మానుకోటకు వస్తుందని పేర్కొన్నారు. తమ ఆర్థిక అవసరాల కోసం బం గారాన్ని అమ్మి డబ్బు కావాలనుకుంటున్నారో.. వారందరికి బంగారాన్ని సులభంగా అమ్మే అవకాశాన్ని వాల్యూగోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ కల్పిస్తోందని చెప్పారు. ప్రస్తుతం బంజారాహిల్స్, సికింద్రాబాద్, ఉప్పల్, కూకట్‌పల్లి, చింతల్‌లో వాల్యూగోల్డ్ బ్రాంచ్‌లు ఉన్నాయని చెప్పారు. ఈనెల 22 నుంచి 30 వరకు వరంగల్‌లో వాహనం తిరుగుతుం దని వివరించారు. బంగారాన్ని అమ్మదలిచిన వారు వాహనం వద్దకు తీసుకువచ్చి నాణ్యత పరీక్ష చేయించి బంగారంను కరిగించి దాన్ని విక్రయించి తక్షణమే నగదు పొందవచ్చని పేర్కొన్నారు. బంగారం కొనుగోలు ప్రక్రియ మొత్తం ఈ వాహనంలోనే చేస్తారని చెప్పారు. వాల్యూగోల్డ్ సేవలను మారుమూల ప్రాంతాలకు కూడ విస్తరింప చేయడం సంతోషంగా ఉందని సీఈవో భరద్వాజ్ పంపత్వార్ తెలిపారు.

నాణ్యత ప్రమాణాలను పొందుపరచాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూలై 24 : ట్రాన్స్‌ఫార్మర్లలో వైఫల్యాలను తగ్గించడానికి కొనుగోళ్లలో నాణ్యత ప్రమాణాలు పొందపరచాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి సూచించారు. సీజీయంలు, జీయంలతో సీఎండీ బుధవారం నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఎస్పీఎం షెడ్లలలో నాణ్యత ప్రమాణాలతో కూడిన ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరు పెంచాలన్నారు. ఎల్కతుర్తి ఎస్పీఎం షెడ్డును అధునాతన సాంకేతికత పరిజ్ఞానంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. సబ్‌స్టేషన్‌లను సమర్థవంతంగా నిర్వహించేందుకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసిజర్‌ను పాటించాలన్నారు. లెంతీ లైన్‌ల మధ్య సమస్యలను పరిష్కరించడానికి ములుగు, నర్సంపేట ఏరియాలో ప్రతీ 4 కిలోమీటర్లకు ఒకటి చొప్పున ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లు పెడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు అశోక్‌కుమార్, సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, సిజీయంలు కిషన్, రాజు చౌహాన్, కె.ఎన్.గుట్ట, జియంలు గౌతమ్‌రెడ్డి, నాగప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అందరూ ప్రకృతి జీవన విధానాన్ని అలవర్చుకోవాలి

- కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి



రిజిస్ట్రార్ మల్లారెడ్డిని సన్మానిస్తున్న ప్రొఫెసర్ రామేశ్వరం తదితరులు

కేయూ క్యాంపస్, జూలై 24 : భారతీయ జీవన విధానంలో ప్రకృతి జీవన విధానం అత్యుత్తమైందని అందరూ అలవర్చుకోవాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ హంటర్‌రోడ్డులోని కేయూ రిటైర్డు ప్రొఫెసర్ గుజ్జుల రామేశ్వరం నిర్వహిస్తున్న రామేశ్వరం ఇంటర్నేషన్ నాచురోపతి లైబ్రరీ రిసెర్చ్ సెంటర్ 6వ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశం ప్రపంచ దేశాలకు ఎంతో ప్రకృతి విజ్ఞానాన్ని ఇచ్చిందన్నారు. ప్రకృతితో సహజీవనంలో వ్యాధులు, రోగ నివారణకు ఆయుర్వేదం, యోగా, సిద్ధా, యునాని, హోమియో ఎంతో ఉపయోగపడుతోందని చెప్పారు. పాశ్చాత్య దేశాల జీవన విధానం, ఆహారపు అలవాట్లను మానుకోవాలని చెప్పారు. ప్రొఫెసర్ రామేశ్వరం విలువైన గ్రంథాలను సేకరించి సొంత ఖర్చులతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. వర్సిటీలో ఆయుర్వేద లైబ్రరీని అనుసంధానం చేసేందుకు ఆలోచిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మల్లారెడ్డిని రామేశ్వరం శాలువ, జ్ఞాపిక అందచేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ప్రొఫెసర్లు గిరీశం, సత్యనారాయణ, విద్యాసాగర్‌రెడ్డి, లక్ష్మణాచారి, రాజ్ మహ్మద్, ఆర్‌జే ప్రసాద్, డాక్టర్ రఘురామయ్య, జర్నలిస్టు చిలుముళ్ళ సుధాకర్ పాల్గొన్నారు.

కేయూ ప్రీ పీహెచ్‌డీ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు 31

కేయూ క్యాంపస్, జూలై 24 : కాకతీయ యూనివర్సిటీలోని అన్నివిభాగాల ప్రీ పీహెచ్‌డీ పరీక్షల ఫీజులను ఎటువంటి అపరాధ రుసుం లేకుండా జూలై 31 వరకు చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్యలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్, ఆర్ట్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, సోషల్ సైన్స్, ఎడ్యుకేషన్, లా, ఫార్మసీ, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ తదితర పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్గిన విద్యార్థులను ఫీజులను చెల్లించుకోవాలని కోరారు. రూ.250 అపరాధ రుసుంతో ఆగస్టు 7 వరకు ఫీజులు చెల్లించుకునేందుకు అవకాశంఉందన్నారు.

1 నుంచి కేయూలో ఇంగ్లీష్ తరగతులు

కేయూ క్యాంపస్, జూలై 24: కేయూ సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ (సెల్ట్) ఆధ్వర్యంలో 40 రోజులు పాటు స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్ శిక్షణ తరగతులు ఆగస్టు 1 నుంచి నిర్వహిస్తామని సెల్ట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.మేఘనరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 1500ఇతరలకు, రూ.100 క్యాంపస్ విద్యార్థులు క్లాస్‌లకు చెల్లించుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తి కల్గిన వారు కేయూ క్యాంపస్‌లోని ఇంగ్లీష్ విభాగంలో సంప్రదించాలని కోరారు. ఆగస్టు 1నుంచి ప్రతీ రోజు సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

గంజాయి పీలుస్తున్న ఇద్దరు యువకుల అరెస్టు

వరంగల్ క్రైం, జూలై 24 : గంజాయి పీలుస్తున్న ఇద్దరు యువకులను కాకతీయ యూనివర్సిటీ పోలీసులు పట్టుకుని వారి వద్ద నుంచి 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రవిందర్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం పెట్రోలింగ్ చేస్తుండగా గుండ్లసింగారం కెనాల్ వద్ద చెట్ల పొదల్లో కె.రాహుల్, పి.రవిందర్ అనే ఇద్దరు యువకులు సిగరెట్లు తాగుతూ కనిపించారు. అనుమానం వచ్చి వారిని పట్టుకుని ప్రశ్నించగా కాజీపేట వద్ద గుర్తుతెలియని వ్యక్తి నుంచి గంజాయి కొనుక్కుని తాగుతున్నట్లు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవిందర్ తెలిపారు. పట్టుబడిన వారిలో రాహుల్ హసన్‌పర్తి మండలం ముచ్చర్ల వాసి కాగా రవిందర్ ఏటూర్‌నాగారం మండలం కమలాపూర్ గ్రామస్థుడు.

ఓరుగల్లుకు వరాలిచ్చేనా?

5వ పేజీ తరవాయి

కీలకమైన మూడో విడత పనులు కూడా దాదాపు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు రూ.13,911కోట్లు వరకు ప్రభుత్వం దేవాదుల కోసం ఖర్చు చేయగా మరో రూ.3,588కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. 3వేల ఎకరాలకు పైగా భూసేకరణ చేయాల్సి ఉండగా, ఇందులో 952ఎకరాలు పట్టణ ప్రాంతంలో ఉంది. దీంతో భూసేకరణతో సంబంధం లేకుండా కేవలం రూ.650కోట్లు కేటాయిస్తే మూడో విడత నీళ్లను ఎత్తిపోసుకునే వీలుందని ప్రభుత్వం ప్రాథమిక అంచనాకు వచ్చింది. ఈ మొత్తాన్ని ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయించే అవకాశం ఉందని సమాచారం. అలాగే వర్ధన్నపేట, తొర్రూరు ప్రాంతాల భూములకు సాగునీరందించే ఎస్సారెస్పీ-2కు సంబంధించి పనులు పూర్తి చేసేందుకు రూ.250కోట్ల వరకు అవసరమని గుర్తించారు. అలాగే భూపాలపల్లి జిల్లా కాటారంలోని చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తికి రూ.350కోట్లు అవసరమని భావిస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ పనులు కూడా జరుగుతున్నాయి. అలాగే సరిహద్దులో ఉన్న ములుగు జిల్లా వాజేడు మండలం కిష్టాపూర్ అడవుల్లోని మోడికుంట ప్రాజెక్టును కూడా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రతిపాదనలు చేశారు. 19ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ మోడికుంట ప్రాజెక్టుకు రూ.500.25కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసి అనుమతుల కోసం కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)కి పంపారు. ఈ క్రమంలో మోడికుంటకు కూడా నిధులు కేటాయించే అవకాశం కనిపిస్తోంది. ములుగు జిల్లా పాలెంవాగు ప్రాజెక్టును గత ప్రభుత్వం హడావిడిగా ప్రారంభించింది. అయితే డిస్ట్రిబ్యూటర్ కెనాళ్లు, పిల్ల కాలువలు పూర్తవకపోవడంతో రైతులకు సాగునీరందటం లేదు. పాలెంవాగు ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు రూ.125కోట్ల వరకు అవసరంగా గుర్తించారు. బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారనే ఆశతో ఉన్నారు. అలాగే దేవాదుల నుంచి రామప్ప చెరువులోకి నీటిని ఎత్తిపోసి అక్కడి నుంచి పాకాల, లక్నవరం చెరువుల్లోకి నీటిని తరలించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో సుమారు 32వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. అయితే పాకాల వరకు దేవాదుల నీళ్ల ఎత్తిపోసే పనులు పూర్తయినా రామప్ప నుంచి లక్నవరం వరకు నీటిని ఎత్తిపోసే పనులకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రధానంగా 103.31ఎకరాల భూసేకరణ సమస్యగా మారింది. లక్నవరం వరకు గ్రావిటీ కెనాల్ పనులు పూర్తి చేయాలని సూచించారు. సుమారు రూ.61కోట్లు కేటాయిస్తే పనులు పూర్తి అవుతాయని అంచనా. వీటితో పాటు మరికొన్ని మైనర్ ప్రాజెక్టులకు కూడా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించే అవకాశం ఉందని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశాభావంతో ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలోని మరికొన్ని..

- మహబూబాబాద్ జిల్లా మల్యాల కృషి విజ్ఞాన కేంద్రాన్ని(కేవీసీ) ఉద్యాన యూనివర్సిటీగా మార్చాలనే డిమాండ్ ఉంది. 1998 నుంచి ఇక్కడి రైతులు ఉద్యాన యూనివర్సిటీ కోసం ఆందోళనలు చేస్తున్నారు. బడ్జెట్‌లో మహబూబాబాద్ రైతుల కల నేరవేరుతుందా అనే ఆశతో ఎదురుచూస్తున్నారు.
- జనగామ జిల్లా కల్లెం టెక్స్‌టైల్ పార్కు కోసం గత ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది. 2019లో అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ చొరవతో పనుల్లో కదిలిక వచ్చింది. పార్కులో మౌలిక సదుపాయలు కల్పించాలి. 40మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకొచ్చారు. పూర్తి స్థాయిలో నిధులు లేకపోవటంతో ఆశించిన స్థాయిలో పరిశ్రమలు రావటం లేదు.
- కొడకండ్ల మినీ టెక్స్‌టైల్ పార్కు కోసం 2020-21లో భూమిని పరిశీలించారు. కానీ ప్రత్యేకంగా నిధులు కే టాయింపులు లేకపోవటంతో అడుగులుపడటం లేదు.
- ములుగు జిల్లా మంగపేటలో బిల్ట్ ఫ్యాక్టరీని పూర్తిగా మూసేసి ఐటీసీ కంపెనీకి లీజుకు ఇచ్చారు. ఈ ప్రాంతంలో కొత్త ప్రాజెక్టు ఏర్పాటు చేస్తే గిరిజనులకు ఉపాధి అవకాశాలు ఏర్పాటవుతాయని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తుందన్న ఆశతో ఉన్నారు.
- యునెస్కో గుర్తింపు పొందిన రామప్పలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి లేదు. కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీం కింద రూ.60 కోట్లు కేటాయించి పనులు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ఉపాలయాల పునరుద్ధరణకు రూ 25కోట్ల వరకు కేటాయిస్తామని ప్రకటించిన నిధులు విడుదలలో జాప్యం జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత పైసా నిధులు కేటాయించలేదు. బడ్జెట్‌లో రామప్ప అభివృద్ధికి నిధులు కేటాయిస్తారనే ఆశతో ఉన్నారు.
- హనుమకొండ జిల్లా మడికొండలో వీవర్స్ పార్కు అభివృద్ధికి చేయూతనిచ్చేలా ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారనే ఆశతో చేనేత కార్మికులున్నారు.
- వరంగల్ మహానగరంలో ఐటీ టవర్లను తీసుకరావటంతో పాటు కొత్త పరిశ్రమలు వచ్చేలా నిధులు కేటాయింపులు ఉంటాయని ఆకాంక్షిస్తున్నారు.
- వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ అస్పత్రికి నిధుల కొరత ఉంది. ఇటీవల సీఎం సైతం ఈ అస్పత్రిని పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేసేందుకు నిధులు కేటాయిస్తారని భావిస్తున్నారు.
- వరంగల్ జైలును 2021 జూన్ 1న కూల్చేసి అస్పత్రిని నిర్మించారు. మామునూరులో రూ 250కోట్ల వ్యయంతో అత్యాధునిక జైలును నిర్మిస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. అయితే నిధుల కొరతతో జైలు పనులు ముందుకు సాగటం లేదు.
- ఖిలా వరంగల్ కోటను మరింత అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని నగరవాసులు, పర్యాటకులు ఎదురు చూస్తున్నారు.
- భూపాలపల్లిలో సింగరేణి కార్మికులు అత్యధికంగా ఉండటంతో ఇక్కడ మైనింగ్ విద్యాలయంతో పాటు ఇంజనీరింగ్ కాలేజీ కూడా ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపుతుందనే ఆశతో ప్రజలున్నారు.

అన్నదాతలను మోసగిస్తున్న కాంగ్రెస్

- రైతుబంధు పైసలు రుణమాఫీకి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర (మహబూబాబాద్ జిల్లా), జూలై 24 : రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. పెద్దవంగర మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో రైతులందరికీ రుణమాఫీ చేస్తామని నమ్మించి , కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి, ఇప్పుడు రుణమాఫీకి అనేక ఆంక్షలు, కొర్రీలు పెట్టి ఆగం ఎందుకు చుస్తున్నదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదని, మోసపూరితమని ధ్వజమెత్తారు. రుణమాఫీ పేరిట రాష్ట్ర రైతాంగాన్ని రైవంత్ సర్కార్ మోసం చేస్తున్నదని ధ్వజమత్తారు. రైతులకు జూన్‌లో ఇవ్వాల్సిన రైతు బంధు నిధుల్లోంచి రూ.7000 కోట్లు దారిమళ్లించి వాటిని రుణమాఫీగా అందిస్తున్నామని చెబుతూ రేవంత్ సర్కార్ పొజులు కొడుతున్నదని దుయ్యబట్టారు. రైతలకు హక్కుగా రావాల్సిన రైతు బంధు డబ్బు నుంచి కొంత మొత్తాన్ని విదిల్చి రుణమాఫీగా ఇస్తున్నట్టు చెప్పుకోవడం దారుణమని మండిపడ్డారు. రైతుల జీవితాలతో ఆడుకుంటే ఊరుకునేది లేదని, రైతులందరికీ రుణమాఫీ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు.

పోరాటం చేసి తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్ చేతుల్లో పెట్టడంతో ప్రజలు కష్టాలు మొదలయ్యాయని విమర్శించారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో ప్రతీ రైతును ఆదుకున్నామని, సబ్బండవర్గాలకు అండగా నిలిచామని తెలిపారు. కాంగ్రెస్ రాగానే కరువు, కష్టాలు, కరెంట్ కోతలు మళ్లీ మొదలైనట్లు వివరించారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ వి.రామచంద్రయ్యశర్మ, శ్రీరాం సంజయ్, శ్రీరాం సుధీర్, వెంకన్న, రాసాల సమ్మయ్య, శ్రీరాం రాము, వెంకట్రామయ్య, చింతల భాస్కర్‌రావు, శ్రీనివాస్ రవి, అనుదీప్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి దూరవిద్య బీఎల్ఐసీ పరీక్షలు

కేయూ క్యాంపస్, జూలై 24 : కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం బీఎల్ఐఎస్సీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు13 నుంచి జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.నరేందర్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 13, 16, 19, 21 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. కేయూ క్యాంపస్‌లోని బీఈడీ కళాశాల, కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే ఎస్డీఎల్‌సీఈ బీఎల్ ఐఎస్సీ ఇయర్‌వైజ్ ఓల్డ్ అభ్యర్థులకు ఆగస్టు 13, 16, 19, 21, 23, 27, 29 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

27న విద్యుత్ పోల్ క్లైంబింగ్ పరీక్ష

హనుమకొండ టౌన్, జూలై 24 : హై కోర్టు ఆదేశానుసారం ఉమ్మడి వరంగల్‌లో జూనియన్ లైన్‌మెన్‌కు అర్హులైన అభ్యర్థులకు ఈ నెల 27న ములుగు రోడ్డులోని ఉత్తర విద్యుత్ శిక్షణ సంస్థ (ఎన్‌పిటిఐ)లో ఉదయం 9 గంటలకు విద్యుత్ పోల్ క్లైంబింగ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు హనుమకొండ ఎస్ఈ కె. వెంకటరమణ తెలిపారు. అభ్యర్థులకు ఇప్పటికే వ్యక్తిగతంగా సమాచారం ఇవ్వడం జరిగిందని, అభ్యర్థుల జాబితాను హనుమకొండ సర్కిల్ ఆఫీస్‌లో సైతం అందుబాటులో ఉందన్నారు.

13 మంది ఏఎస్ఐలు బదిలీ

- 44 మంది కానిస్టేబుళ్లకూ స్థానచలనం

వరంగల్ క్రైం, జూలై 24 : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న 13 మంది ఏఎస్ఐలు, 4 కానిస్టేబుళ్లు, 40 మంది హెడ్ కానిస్టేబుళ్లు బదిలీ అయ్యారు. బుధవారం కౌన్సెలింగ్ పద్ధతిలో ఆయా పోలీస్ స్టేషన్‌లకు కేటాయిస్తూ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు.

రేపు, ఎల్లుండి భద్రాద్రి జోన్ స్టాఫ్‌నర్సుల బదిలీల కౌన్సెలింగ్

గిర్మాజిపేట, జూలై 24 : రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సాధారణ బదిలీల్లో భాగంగా సీనియారిటీ జాబితాలో అక్రమాలు జరిగాయన్న కారణంగా వాయిదాపడిన స్టాఫ్ నర్సుల బదిలీల కౌన్సెలింగ్ బుధవారం నుంచి ప్రారంభమైంది. తొలిరోజైన బుధవారం జోన్ 1 (కాళేశ్వరం) కౌన్సెలింగ్ ఉదయం 9 గంటలకు, జోన్ 2(బాసర) కౌన్సెలింగ్ మధ్యాహ్నం 1 గంటకు హైదరాబాద్ వెంగళరావునగర్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వేల్ఫేర్ (ఐహెచ్ఎఫ్‌డబ్ల్యూ)లో జరిగింది. ఇక జోన్ 4 (భద్రాద్రి) పరిధిలోని వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన స్టాఫ్‌నర్సులకు 26, 27 తేదీల్లో నారాయణగూడాలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) కౌన్సెలింగ్ జరగనుంది. ఇందులో భాగంగా బదిలీ జాబితాలోని సీరియల్ నెంబర్ 1 నుంచి 125 వరకు 26 వతేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు, సీరియల్ నెంబర్ 126 నుంచి 250 వరకు మధ్యాహ్నం 1 గంటకు కౌన్సెలింగ్ జరుగుతుందని ప్రజారోగ్యశాఖ విడుదల చేసిన షెడ్యూల్‌లో పేర్కొంది. మరుసటి రోజు శనివారం ఉదయం 9 గంటలకు సీరియల్ నెంబర్ 251 నుంచి 375 వరకు, మధ్యాహ్నం 1 గంటకు సీరియల్ నెంబర్ 376 నుంచి చివరి నెంబర్ వరకు కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించింది. అలాగే మల్టీజోన్ 1 హెడ్‌నర్సుల కౌన్సెలింగ్ 30వ తేదీ ఉదయం 9గంటలకు మల్టీజోన్ 2 హెడ్‌నర్సులకు, మధ్యాహ్నం 1 గంటకు నారాయణగూడలోని ఐపీఎంలో కౌన్సెలింగ్ జరగనుంది.



ఘనంగా కట్ట మైసమ్మ బోనాలు

పోచమ్మమైదాన్, జూలై 24: గ్రేటర్ వరంగల్ మూడో డివిజన్ పైడిపల్లిలో బుధవారం కట్ట మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ జన్ను షిబారాణి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు జన్ను అనిల్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై బోనాలను ప్రారంభించి, ప్రత్యేక పూజలు చేశారు. లింగం సంపత్, లింగం మూర్తి, కసివోజ్జల పూర్ణచం దర్, కనుకుల్ల సారంగపాణి, గజ్జెల చంద్రయ్య, జన్ను రాజ య్య, శ్రీపతి మో హన్, ఇట్యాల సతీష్‌కుమార్ పాల్గొన్నారు.



గొర్రెకు శాకపోస్తున్న దృశ్యం

ఇండోర్ స్టేడియం మరమ్మతు పనులను వెంటనే చేయండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, జూలై 24 : బల్దియా ఇండోర్ స్టేడియంలో మరమ్మత్తు పనులు వెంటనే పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. బుధవారం బల్దయా కార్యాలయంలో ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. స్టేడియం పై కప్పు వర్షానికి కురవడం వల్ల ఫ్లోరింగ్ తడిచి దెబ్బతింటుందని, వెంటనే రిపేరు పనులు ప్రారంభించాలన్నారు. ఆగస్టు 15 లోపు బల్దియా సిబ్బంది ఇండోర్‌లో పలు క్రీడాంశాలలో పోటీలు నిర్వహి ంచేందుకు అణువుగా స్టేడియం పనులు పూర్తి చేయాల న్నారు. కమిషనర్ వెంట ఇన్‌చార్జి ఎస్ఈ రాజయ్య, డీఎఫ్‌వో శంకర్‌లింగం, డీఈ రవికుమార్, ఏఈ శ్రీకాంత్, స్టేడియం సిబ్బంది భరత్‌కుమార్ రెడ్డి, కోచ్ శ్రీధర్ పాల్గొన్నారు.

ప్లాంటేషన్ పనుల్లో వేగం పెంచండి

వరంగల్ కార్పొరేషన్ : అవెన్యూ ప్లాంటేషన్ పనుల్లో సిబ్బంది వేగం పెంచాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. బుధవారం బల్దియా కార్యాలయంలో హార్టికల్చర్ అధికారులతో సమావేశంలో ఏర్పాటు చేసి మాట్లాడారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో పెరిగిన మొక్కలను వర్షాకాలం సీజన్‌లో నాటేందుకు సిద్ధం చేయాలన్నారు. పార్కులలో మొక్కలు నాటేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని, ట్రాక్టర్ మౌంటెన్ యంత్రాలను అద్దెకు తీసుకుని మొక్కలు నాటే ప్రక్రియను ప్రారంభించాలన్నారు. నాటిన మొక్కలకు జియో ట్యాగింగ్ చేయాలని చెప్పారు. ఇప్పటి వరకు 8 నర్సరీలలో మొక్కలు పెంచడం జరుగుతుందని ఇంకా ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసిన మొక్కలను సైతం నాటాలని ఆదేశించారు. ఈ సమావేశంలో హార్టికల్చర్ అధికారి రమేష్, సహాయ అధికారులు ప్రిన్సి, అశ్విని, ప్రియాంక, అనూహ్య పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని విస్మరించిన కేంద్రం

బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంపై ఎంసీపీఐ(యూ), కాంగ్రెస్, వామపక్షాలు, ఎస్ఎఫ్ఐ నిరసన

ఖిలావరంగల్, జూలై 24:విభజన హామీలను విస్మరించిన కేంద్రప్రభుత్వం కేంద్రబడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపిందని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి తీవ్రంగా విమర్శించారు. బుధవారం అండర్‌బ్రిడ్జి జీబుల అడ్డా వద్ద సీపీఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే బాషుమియా, జిల్లా కార్య వర్గసభ్యుడు దండు లక్ష్మణ్, జిల్లా సమితి సభ్యులు శరత్, ఓర్సు రాజు, పరికరాల రమేష్, అంజద్, వెంకట్రాద్రి, కుమార్, భవానీ పాల్గొన్నారు.

●శంభునిపేట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ తెలంగాణకు అన్యాయమే చేసిందని 43వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పసునూరి వేణుగోపాల్ అన్నారు. బుధవారం బొల్లికుంటలోని కార్యకర్తలతో కలిసి సమావేశమై మాట్లాడారు. లోక్ సభ ఎన్నికల ముందు బీజేపీ అగ్రనేతలు తెలంగాణ కు వందల వరాలిచ్చి ఇప్పుడు మొండి చేయి చూపారని విమర్శించారు. విద్యా రంగానికి కేంద్ర బడ్జెట్ ప్రాధా న్యతనివ్వలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ ఆరోపించారు. బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులు రంగశాయిపేట ప్రభుత్వ పాఠశాలను సందర్శిం చి సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో శివచంద ర్, సాయి కార్తిక్, లిఖిత్, పాల్గొన్నారు.

● సంగెం : కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై శీతకన్నును ప్రదర్శిస్తున్నదని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.





అండర్‌బ్రిడ్జి వద్ద కేంద్రం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మేకల రవి , సంగెంలో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బుధవారం మండల కేంద్రంలో దిష్టిబొమ్మ దహనం అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడారు. మండల అధ్యక్షుడు చోల్లేటి మాధవరెడ్డి, వర్కింగ్ ప్రసిడెంటు మెట్టుపల్లి రమేష్,మండల యూత్ అధ్యక్షుడు ఆగపాటి రాజుగౌడ్, మండల నాయకులు కందకట్ల నరహరి, అచ్చ నాగరాజు,గుండేటి రాజ్‌కుమార్, మాజీ ఎంపీటీ సీలు గూడ సంపత్‌రెడ్డి, మెటుపల్లి మల్లయ్య నాయకులు పులి సాంబయ్య కాగితాల జగన్నాధచారి, గుండేటి శ్రీకర్,కావాటి వెంకటయ్య, మునుకుంట్ల మోహన్, రామకృష్ణ పాల్గొన్నారు.

● గిర్మాజీపేట : వరంగల్ అభివృద్ధిలో అత్యంత కీలకమైన మామూనూర్ ఎయిర్‌పోర్టు అంశాన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని ఎంసీపీఐ(యు) వరంగల్ నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్ బుధవారం విడుదలచేసిన ప్రకటనలో ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించలేదని, రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న ప్రకారం బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీతో పాటు గిరిజన విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయిం చలేదని ఆయన విమర్శించారు.

● గీసుగొండ : కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం చేసిందని కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు భగ్గుమన్నాయి. బీజేపీ పక్షపాత వైఖరికి నిరసనగా వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై కొనాయిమాకుల వద్ద బుధవా రం రాస్తారోకో నిర్వహించి ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశాయి. కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాయి. ఈ సందర్భంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి భీమగాని సౌజన్య మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావుల శ్రీనివాస్, నియో జకవర్గ అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి కొమురారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.డీ జావీద్, నాయకులు దూల వెంకటేశ్వర్లు, దూపాకి సంతోష్, ఎలగొండ ప్రవీణ్, దౌడు ప్రవీణ్ కుమార్, దౌడు భరత్, కందికొండ మల్లేష్, మొగిలి, మల్లారెడ్డి, బోడకుంట్ల రాజు, కోల వేణు, నరేందర్, సునిల్, రవి, ఫిరోజ్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

పోచమ్మమైదాన్, జూలై 24: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ఆర్థిక బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ హకీంనవీద్ అన్నారు. వరంగల్ పోచమ్మ మైదాన్‌లో బుధవారం విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత కల్పించాలని, బడ్జెట్‌లో 30 శాతం పై చిలుకు నిధులు కేటాయిస్తే ప్రభుత్వ విద్యాల యాలు, సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలు, యూనివర్సిటీల పరిస్థితి మెరుగుపడుతుందని అన్నారు. గత పది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్సుమెంటు బకాయిల కోసం ఈ బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

పార్థివ దేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగింత

వరంగల్ చౌరస్తా, జూలై 24: సమాజ హితం కోరే ఒక పార్థివ దేహం భావి వైద్యులకు వైద్య, విద్యా పాఠం నేర్పుతుందని తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ అధ్యక్షుడు కోనేరెడ్డి మల్లారెడ్డి అన్నారు. నగరానికి చెందిన చిలకమ్మ (76) అనే మహిళ మృతి చెందగా ఆమె శరీరాన్ని బుధవారం ప్రత్యేక అంబులెన్స్ ద్వారా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఆదేశాల మేరకు కళాశాలలో అప్పగించారు. ఎవరైనా మృతి చెందితే శరీరంలోని అవయవాలు , నేత్రాలు దానాలు చేయదల్చుకున్న వారు తమకు సమాచారం అదించాలని వాటిని వైద్య కళాశాలకు అందిస్తామని ఆయన కోరారు. వివరాలకు సెల్ నంబర్ :8790548706 కు తెలపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కరేటి.శంకర్‌రావు యాదవ్, డి. రాజమౌళి, రాజు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

గీసుగొండ, జూలై 24:గొర్రెకుంట గ్రామానికి చెందిన ల్యాదెల్ల స్వామి కొద్దినెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా మృతుడి కుటుంబానికి అతడి బాల్యమిత్రులు బుధవారం రూ. 15 వేల ఆర్థిక సహాయాన్ని అందచేశారు. నమిండ్ల క్లైమెంట్, సంజీవ, శ్రీనివాస్, స్వామి, రాజు, భాస్కర్, సాల్మన్, రామ్మోహన్ పాల్గొన్నారు.

'ఐఏఎస్ స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి'

మిల్స్‌కాలనీ, జూలై 24: వికలాంగుల పట్ల అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితఆ సబర్వాల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నవ తెలంగాణ దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి. అజీమ్ డిమాండ్ చేశారు. బుధఖం కార్పొరేషన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అజీమ్ మాట్లాడుత స్మిత వ్యాఖ్యలు 2016 ఆర్పీడబ్ల్యుడీ చట్టం ప్రకారం నేరమని తెలిపారు. దివ్యాంగులను వివక్షకు గురిచేసే విధంగా, కించపరిచే విధంగా పోస్టు చేసిన స్మితపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపటి 'చలో అసెంబ్లీ'ని విజయవంతం చేయాలి

ఖిలావరంగల్, జూలై 24: తెలంగాణ భవననిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి గాను శుక్రవారం చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర భవననిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గన్నారపు రమేష్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, భవననిర్మాణ రంగ కార్మికుల సమస్యల సాధనకై ఈ నెల 26 (శుక్రవారం)అసెంబ్లీ ఇందిర పార్కు ధర్నా చౌక్ వద్ద రాష్ట్ర స్థాయి ధర్నాను విజయవంతం చేయాలని తెలిపారు.

వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, జూలై 24: వరంగల్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఇద్దరికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి ఒకొక్కరికి రూ. 2వేల జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో 22 మందికి రూ. 29వేల జరిమాన విధించినట్లు పేర్కొన్నారు. తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు.

అరెస్టు చేసిన విద్యార్థులను విడుదల చేయాలి

ఖిలావరంగల్, జూలై 24:పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ప్రజాస్వామ్య యుతంగా అసెంబ్లీ ముట్టడికి వచ్చిన పీడీఎస్‌యూ విద్యార్థులను అరెస్టు చేయడం అప్రస్వామ్యమికమని, వారిని వెంటనే విడుదల చేయాలని సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర జిల్లా నాయకుడు కె. గోవర్ధన్, రావుల బాలరాజులు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం విద్యారంగానికి నిధులు కేటాయించాలని, అన్ని యూనిర్సిటీలకు వీసీలను నియామకం చేయాలని, అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాల నే డిమాండ్‌తో వారు అసెంబ్లీ ముట్టడికి వచ్చారన్నారు. పోలీసులు ఆందోళ నకు దిగిన విద్యార్థులను దొరికిన వారిని దొరికినట్లుగా అరెస్టు చేసి, బండ్లగూడ, కంచన్ బాగ్ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారన్నారు. అరెస్ట్ అయినవారిలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు బోనగిరి మధు, ప్రధానకార్య దర్శి పి.నాగరాజు, ఉపాధ్యక్షులు నవీన్, ప్రణయ్‌లతో పాటు ప్రవీణ్, శ్యామ్, నాగరాజు, య శ్వ ంత్‌తదితర 30 మంది విద్యార్థులున్నారని తెలిపారు. గత ఆరు నెలలుగా విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా కేవలం నిర్బదం, అణచివేత ద్వారా ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా తన వైఖరిని మార్చుకోవాలన్నారు. అరెస్టు చేసిన పీడీఎస్‌యూ విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

విద్యార్థులకు ఎల్‌ఈడీ ట్యూబ్ తయారీపై వర్క్‌షాప్ నిర్వహణ

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 24: ఎన్‌జీసీ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల విద్యార్థులకు ఎల్‌ఈడీ ట్యూబ్ లైట్ తయారు చేసేందుకు ఒక్క రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. బుధవారం హంటర్‌రోడ్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో డీఎస్‌వో డాక్టర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 50 ఎన్జీసీ పాఠశాలల నుంచి 150 మంది విద్యారులతో పాటు విషయ నిపుణులు సురేష్‌బాబు, కృష్ణమూర్తి, కృష్ణ, శ్రావణ్, వాసు, పరమేశ్వర్ పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఇండియన్ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్

వరంగల్ కల్చరల్, జూలై 24: జాతీయ స్పోర్ట్స్ అథారిటి డైరెక్టర్ ఐఏఎస్ అధికారిణి కె. లక్ష్మి బుధవారం భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న అధికారిణి లక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో ప్రధానార్చ కులు భద్రకాళి శేష అమ్మవారికి పూజలు నిర్వహించి మంగళహారతి ఆశీర్వచనం నిర్వహించారు.



స్పోర్ట్స్ డైరెక్టర్‌కు ఆశీర్వచనం అందజేస్తున్న ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు

తదుపరి ఆలయ ఈవో శేష భారతి , ప్రధానార్చకులు భద్రకాళి శేషులు ఐఏఎస్ అధికారిణి లక్ష్మికి అమ్మవారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

ముదిరాజ్‌లను బీసీ ఏ లో చేర్చాలి

గీసుగొండ, జూలై 24: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలలో ఇచ్చిన విధంగా ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి తొలగించి బీసీ ఏ లో చేర్చాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి డిమాండ్ చేశారు. సంఘం నాయకులు గీసుగొండ అంబేద్కర్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయానికి బుధవారం ర్యాలీగా వెళ్లి డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రియాజుద్దీన్‌కు అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌ల కోసం మత్స్యకార్మికుల సొసైటీని ఏర్పాటుచేసి రూ.1000 కోట్లను కేటాయించాలన్నారు. మత్స్యకార్మికులకు ప్రతీ ఒక్కరికి 75 శాతం సబ్సిడీతో రుణాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార్మికసంఘం జిల్లా డైరెక్టర్ కంజాల కోటి, మనుగొండ, ఎలుకుర్తి, కొమ్మాల, పోతరాజుపల్లి, ఊకల్, అధ్యక్షులు ఎంబాడి నరసింహస్వామి, బూసాని రఘు, దూల ఉపేందర్, ఉడుతబోయిన వేణు, కొత్తగట్టు కోటి, నాయకులు ఎంబాడి పరమేశ్వర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉపాధ్యాయుడే మార్గదర్శి

శంభునిపేట, జూలై 24 :విద్యా బుద్ధులు నేర్పి దేశానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులే సమాజానికి దిక్సూచి, మార్గదర్శులు అని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జీటీఏ) వరంగల్ జిల్లా అధ్యక్షులు తాళ్ళపల్లి ప్రకాశ్‌గౌడ్ అన్నారు. ఇటీవల పదోన్నతి పొందిన ప్రభుత్వ ఉపాధ్యాయులను జీటీఏ ఆధ్వర్యంలో బుదవారం శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లాలోని 40 మంది పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను సన్మానించమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శారదాబాయి, మట్టెవాడ హెచ్‌ఎం అరుణ, చార్‌బౌళి హెచ్‌ఎం మాదవి, జీటీఏ జిల్లా గౌరవ అధ్యక్షులు బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వీరాచారి, కోశాదికారి రాములు, అసోసియేట్ ప్రెసిడెంట్ బిల్లా కోటేశ్వర్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు అధ్యక్షులు జి వెంకటేశం, వరంగల్, ఖిలా వరంగల్ మండలాల కార్యవర్గం, వివిద పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బల్దియా బదిలీల్లో అవకతవకలు

(5వ పేజీ తరువాయి)

పారిశుధ్య విభాగంలో పని చేసిన 8 మంది సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లను బదిలీ చేసి వారి స్థానాల్లో ఇంకా ఎవరిని నియమించకపోవడం వల్ల మిగతా సిబ్బందికి పని భారంగా మారుతుందని సిబ్బంది చెప్పారు. ఇంకా 10 మంది వార్డ్ ఆఫీసర్లకు బల్దియా నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ ఐనా ఇంకా రిలీవ్ కాకుండా ఎమ్మెల్యేలు, అధికారుల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు.

సీడీఎంను కలిసిన బాధితుడు

బల్దియా సీనియర్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియలో తనకు అన్యాయం జరిగిందని ప్రస్తుతం కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఇజ్రాయెల్ ఆవేదన వ్యక్తం చేశాడు. తనకంటే ముందు వెనకాల బదిలీకి అర్హులైన సిబ్బంది ఉన్నా తననే టార్గెట్‌గా చేసి ఖమ్మంకు బదిలీ చేయడం వెనుక కుట్ర దాగి ఉందని వాపోయాడు. రెండు రోజుల క్రితం ఇక్కడ జరిగిన అవకతవకలు, తనకు జరిగిన అన్యాయంపై హైదరాబాద్ ఇన్‌చార్జి సీడీఎంఏ వీపీ గౌతంను కలిసి విన్నవించానని సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తానని చెప్పినట్టు ఇజ్రాయెల్ తెలిపారు.

నగరంలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



కాశిబుగ్గ జంక్షన్‌లో పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని



శంభునిపేటలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని తదితరులు



కరీమాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న మరుపల్ల రవి, నన్నపునేని నరేందర్

వరంగల్ సిటీ, జూలై 24 : నగరంలోని కాశిబుగ్గ జంక్షన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలు ఆ పార్టీ నాయకులు చిలువేరు పవన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై బర్త్‌డే కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. క్యాతం రంజిత్, ముఖ్య నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

● ఖిలావరంగల్, జూలై 24: భవిష్యత్ తెలంగాణ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. బుధవారం 37,38 డివిజన్ ఖిలావరంగల్ చెమన్ వద్ద కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ-సురేష్‌ల ఆధ్వర్యంలో కేటీఆర్ జన్మ దినం సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గట్టికొప్పుల శ్రీదర్, తోట కుమార్, ప్రేమ్‌సాగర్, సారంగపాణి, మేకల ఎల్లయ్య, సంగరబోయిన విజయ్, ధర్మరాజు, శ్రీధర్‌రెడ్డి, సంగరబోయిన ఉమేష్, అరుణ్, కంద్రాతి రమేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే 34వ డివిజన్ శివనగర్‌లో కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి ఆ ధ్వర్యంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమె ్మల్యే నరేందర్ హాజరై కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లను పంపిణీ చేశారు. బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు కేటీఆర్ జన్మదిన వేడుకలను 18వ, డివిజన్ మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ఎస్ నాయకులు ఎమ్డీ యాసిన్, పొలెపాక ప్రశాంత్, జక్కం దాసు, సుధాకర్ పాల్గొన్నారు.

● శంభునిపేట, ఉద్యమంతో తెలంగాణ సాదించిన బీఆర్ఎస్ పార్టీనే మళ్ళీ అధికారంలోకి వస్తుందని ఉద్యమకారులు, కార్యకర్తలంతా ప్రజా సమస్యలపై పోరాడాలని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. 41, 42 డివిజన్‌ల బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారుల ఆధ్వ ర్యంలో బుధవారం శంభునిపేట జంక్షన్‌లో కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నన్నపునేని నరేందర్ పాల్గొని కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొంతం తారామోహన్, శెంకేశి లింగమూర్తి, బజ్జూరి రవి, పరికిపండ్ల ఈశ్వరయ్య, ఆవునూరి లక్ష్మీ, పాకాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. 43వ డివిజన్ బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఆర్టీఏ జంక్షన్‌లో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు భూంపల్లి జయశంకర్, ఇళ్ళందుల రవి, మేకల సూరయ్య, ఎర్ర సాంబయ్య, యాడాల జగపతి, జోరిక సదానందం, కలకోట్ల క్రాంతి, మైదం శేఖర్ తదితరులుపాల్గొన్నారు.

●వరంగల్ కల్చరల్ :బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ బుధవారం భద్రకాళి అమ్మవారికి పూజలు నిర్వహించారు. కేటీఆర్ ఆయురా రోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థిస్తూ వినయ్ భాస్కర్ పూజలు నిర్వహించారు. అనంతరం కార్యకర్తలు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో వినయ్ భాస్కర్ కేక్ కట్ చేసి రక్తదాన శిబిరాల్లో పాల్గొన్నారు.

● గీసుగొండ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మచ్చాపూర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన వేడుకల్లో మాజీ జెడ్పీటీసీ పోలీస్ ధర్మారావు కేక్ కట్‌చేసి స్వీట్లు, పండ్లను పంచారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోడకుంట్ల ప్రకాష్, అంకతి నాగేశ్వర్‌రావు, రాజేశ్వర్‌రావు, ముంత రాజయ్య, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు సిరిసె శ్రీకాంత్ నాయకులు జూలూరి లెనిన్, లడే సంతోష్ పాల్గొన్నారు.

● వరంగల్ చౌరస్తా : బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ , సిరిసిల్ల ఎమ్మెల్యే కే టీఆర్ జన్మదినం సందర్భంగా రామన్నపేటలో వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు కొడకండ్ల సదాంత్ కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు సదాంత్‌తో పాటు కందుకూరి రూపేష్, బుస్స శేఖర్, ఆలేటి రమ, బైరి సబిత, సరోజన, రాచర్ల ఉదయ్‌భాస్కర్, బొమ్మిని సాహిత్ పాల్గొన్నారు.

● కరీమాబాద్ : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిండెంట్ కల్లకుంట్ల తారకరామారావు జన్మదిన వేడుకలను 40వ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి ఆధ్వర్యంలో మంకీ ఫుడ్ కోర్టులో నిర్వహించిన ఈ జన్మదిన వేడుకలకు ముఖ్య అతిధిగా తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులతో కలిసి బర్త్‌డే కేక్ కట్ చేశారు. అనంతరం కార్యకర్తలకు, నాయకులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం మంకీ ఫుడ్ కోర్టులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పూజారి విజయ్, కార్యదర్శి వనం కుమార్, బూత్ కన్వీనర్లు మరుల్ల గౌతం, శెట్టి మోహన్, రాజన్‌బాబు, సాంబయ్య, రంజిత్, వెంకటేశ్వర్లు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు కొలుపుల చంద్రకళ పాల్గొన్నారు.

● మట్టెవాడ : మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదిన వేడుకలను బుధవారం వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు దాచేపల్లి సీతారామ్ ఆధ్వర్యంలో ఎంజీఎం కూడలిలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీచేశారు. అనంత రం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గోరంటల మనోహర్, రమేశ్‌బాబు, సోను, రషీద్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే 25వ డివిజన్ మండిబజార్‌లు డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీం మసూద్ ఆధ్వర్యంలో కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సయ్యద్ మసూద్ కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు.

● పోచమ్మమైదాన్ : గ్రేటర్ వరంగల్ మూడవ డివిజన్ పైడిపెల్లిలో బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ ఇట్యాల హరికృష్ణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు బోనాల సల్మాన్, పండగ రవీందర్‌రెడ్డి, బొల్లం విజయ్ కుమార్ పాల్గొన్నారు.

● మిల్స్‌కాలనీ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని 36వ డివిజన్ చింతల్‌లో ఆ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఏల్పుగొండ యాకయ్య ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. బుధవారం చింతల్ బ్రిడ్జీ కింద బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి ఆయన కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. డివిజన్ బీఆర్ఎస్ నాయకులు షర్ఫుద్దీన్, అనిల్, రాజు, అంకూష్, గణేష్, రవీందర్, మోహన్, ఎల్లయ్య, ముజ్జు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL గురువారం 25 జూలై 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

కేంద్ర మంత్రులు వెంటనే రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న నర్సింగరావు

చెన్నారావుపేట, జూలై 24 : కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిన కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు వెంటనే రాజీనామా చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సాదు నర్సింగరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ తెలంగాణకు ప్రాధన్యత ఇవ్వకపోవడం చాలా బాధాకరమన్నారు. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ప్రస్తవన ఊసేలేదన్నారు. రాజకీయ కక్షపూరితంగానే బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేసిందన్నారు. కేంద్ర మంత్రులు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశోద నర్సింగం, ఈద విజేందర్, కుమారస్వామి, కోడి కృపాకర్ పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లో వలస కూలీలు

అండగా నిలుస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికులు

ఖానాపురం, జూలై 24 : వ్యవసాయ రంగంలో ఎన్ని యంత్రాలొచ్చినా ఇప్పటికి కొన్ని పనులు మనుషులు చేయనిదే కుదరట్లేదు. అవసరం మేరకు వ్యవసాయ కూలీల లభ్యత రోజు రోజుకూ తగ్గడంతో రైతులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఈ తరుణంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలు (పురుషులు) మండలంలో సాగుకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. వారితోనే పనులు గట్టెకుతున్నాయి. జిల్లాలోనే అతిపెద్ద సాగు నీటి వనరైన పాకాల ఆయకట్టులో ఏటా వర్షాకాలంలో సుమారు 30వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. వర్షాకాలంలో రైతులందరు ఒకేసారి వరినాట్లకు సిద్ధమవడంతో కూలీల కొరత ఏర్పడుతుంది. ఈ తరుణంలో రైతులు బీహార్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, ఉత్తరఖండ్, పొరుగునే ఉన్నా ఆంధ్రప్రదేశ్ నుంచి వసల కూలీలను మండలానికి రప్పించి అనుకున్న సమయానికి అదనులోనే వరినాట్లు పూర్తి చేస్తున్నారు. గత మూడు సంవత్సరాలుగా వలస కూలీల ఆగమనంతో పాకాల ఆయకట్టులో వరిసాట్లు సకాలంలో పూర్తవడంతో రైతులకు ఎంతో వెసులుబాటు చేకూరుతుంది.

త్వరితగతిన వరినాట్లు పూర్తి..

స్థానిక కూలీల కంటే వలస కూలీలు నాటుకు డబ్బులు తక్కువ తీసుకోవడంతో పాటు అదనపు పనిగంటలు పనిచేస్తూ సకాలంలో వరినాట్లు పడేలా పనిచేస్తున్నారు. స్థానిక కూలీలకైతే ఎకరా నాటుకు రూ.5వేల నుంచి రూ.5500 చెల్లించాల్సి వస్తుండగా వలస కూలీలు ఎకరాకు రూ.4500 తీసుకుంటున్నారు. వలస కూలీలు ఒక గ్రూపులో 15 నుంచి 20 మంది ఉంటారు. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు 12గంటలు పాటు విరామం లేకుండా వరినాట్లు వేస్తు పనులు త్వరితగతిన పూర్తి చేస్తున్నారు. స్థానిక కూలీలైతే వరినారును రైతే స్వయంగానో లేక అదనంగా ఒక కూలి మనిషిని పెట్టి పొలంలో వరినారు కట్టలు వేయాల్సి వస్తుంది, కానీ, వలస కూలీలు వారే స్వయంగా వరినారు కట్టలు పొలంలో వేసుకొని ఒక క్రమ



ఖానాపురంలో వరినాట్లు వేస్తున్న వలస కూలీలు

పద్ధతిలో (తాడు లాగి) వరినాట్లు వేస్తున్నారు. పైగా పొలంలో కాలిబాటలు తీస్తున్నారు.. రైతు పొలం దమ్ము కొట్టించి, దుక్కి మందు చల్లుకొని పొలం నాటుకు సిద్ధం చేసి ఇస్తే చాలు వారే నాటువేసి వెళ్తారు. దీంతో రైతులకు ఇబ్బందులు తగ్గడంతో వలసకూలీలను ఆశ్రయిస్తున్నారు.

ప్రతీ పనిలో వారే..

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వలస కార్మికులు వ్యవసాయ పనులతో పాటు భవన నిర్మాణ రంగంలో తాపీ మేస్త్రీలుగా,హమాలీలుగా ప్రతి పనిలో వారే కూలీలుగా వ్యవహరిస్తున్నారు. వ్యవసాయంలో నాటుపెట్టడం, కలుపు తీత, హార్వెస్టర్ల డ్రైవర్లుగా, ఇతర యంత్రాల నిర్వాహకులుగా, వ్యవసాయ ఉత్పత్తులను సీజన్‌లో కాంటాలు వేయడానికి హమాలీలుగా పంజాబ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వారు వచ్చి రైతులకు అండగా నిలుస్తున్నారు. భవన నిర్మాణ రంగంలో చత్తీస్‌ఘడ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ తదితర రంగాల నుంచి వచ్చి వారి పని నైపుణ్యాలను ప్రదర్శించి ఇక్కడి ప్రజలను ఆకట్టుకుంటున్నారు. దీంతో గ్రామాల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీల సందడి నెలకొంటుంది.

రోజుకు రూ.600 నుంచి రూ.700 సంపాదిస్తాం..

హమాల్, ఉత్తరాఖండ్



ఉత్తరఖండ్ రాష్ట్రం ఉదాంసింగ్‌నగర్ జిల్లా రుద్రాపూర్ గ్రామం నుంచి 20 మంది పురుషులం నాట్లు వేయడానికి వలస కూలీలుగా ఖానాపురం వచ్చాం. ఇక్కడే ఆవాసం ఏర్పాటు చేసుకొని రోజు 12 గంటల పాటు నాటు పనుల్లో పాల్గొంటాం. రోజు రూ.600 నుంచి రూ.700 వరకు సంపాదిస్తాం, నాటు పనులు ముగిసే వరకు ఇక్కడే ఉండి పనులు పూర్త యిన తరువాత స్వగ్రామాలకు వెళ్తాం. వ్యవసాయ పనులైన నాటు, కలుపు తీత, పత్తి ఏరడం, వరికోతలు తదితరు పనులు ఎక్కడ ఉంటే అక్కడకు కాలానుగుణంగా ఉపాధి కోసం వలస వెళ్తుంటాం.

స్థానికంగా కూలీల కొరత ఉంది..

గండ్రాతి శ్రీనివాస్, రైతు, ఖానాపురం



మన ప్రాంతంలో వరిలో నాటు పనులు మహిళలే చేస్తుండటంతో స్థానికంగా కూలీల కొరత ఉంది. సకాలంలో వరినాట్లు పూర్తి చేయడానికి ఇతర రాష్ట్రాల వలస కూలీలపై ఆధార పడాల్సి వస్తుంది. ఇతర రాష్ట్రాల నుంచి పురుషులు కూలీ పనులు చేయడానికి రావడంతో వ్యవసాయ పనులు వేగంగా సాగుతున్నాయి. పైగా స్థానిక కూలీల కంటే వలస కూలీలతో వరి నాటు ఖర్చు తక్కువ వస్తుంది. వలస కూలీలు ఓపికగా రైతులకు ఇబ్బందులు కలుగకుండా వాళ్లపని వాళ్లే చేసుకుంటూ వెళ్తున్నారు.

పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

• కలెక్టర్ డాక్టర్ సత్య శారద



భోజనం నాణ్యత గురించి విద్యార్థులను ఆరాతీస్తున్న కలెక్టర్ సత్య శారద



చింతనెక్కొండ చెరువుకట్ట మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

పర్వతగిరి, జూలై 24 : పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించి ప్రతీ రోజు భోజనం ఎలా ఉంటుందని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు అందిస్తున్న చికెన్ నాణ్యత గురించి తెలుసు కోవడానికి గాను పరీక్షల నిమిత్తం ఫుడ్ సేఫ్టీ అధికారులకు పంపించాలని ఆదేశం చగా అధికారులు శాంపిల్‌ను వరంగల్‌కు పంపించారు. విద్యార్థినులకు గీజర్ ద్వారా వేడినీటిని అందించాలని, సోలార్ ద్వారా హాస్టల్‌కు విద్యుత్ సౌకర్యం కల్పిం చాలని సూచించారు. ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌లో వర్షాలకు తరచూ విద్యుత్ అంతరా యం కలుగుతుందని విద్యార్థులు తెలపడంతో మండల కేంద్రంలోని హై స్కూల్‌లో మూడో ఫ్లోర్‌లో సౌకర్యాలు కల్పించి హాస్టల్‌ను అక్కడకు తరలించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రైతు వేదికను సందర్శించి రైతులతో మాట్లాడారు. ఎంతమందికి రుణమాఫీ జరిగిందని అధికారులను ఆరా తీశారు. ఇటీవల వర్షాలకు మండలంలోని చింతనెక్కొండ గ్రామ చెరువుకట్ట కుంగిపోవడంతో చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. మరమ్మతు పనులను రెండు రోజుల్లోగా పూర్తిచేయాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ వెంకటస్వామి, ఏవో ప్రశాంత్, ఐబీ ఏఈ ప్రశాంత్, ఎంపీవో శ్రీనివాసులు, ఏపీఎం కృష్ణమూర్తి తదితరులు పాలొన్నారు.

రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

దుగ్గొండి, జూలై 24 : ఎల్లవేళలా రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని జిల్లా సహకార సంఘం అధికారి సంజీవరెడ్డి సహకార సంఘాల ఛైర్మన్‌లు, సీఈవోలకు సూచించారు. మండలంలోని నాచినపల్లి, తిమ్మంపేట, తొగర్రాయి, లక్ష్మీపురం ఎరువుల విక్రయ కేంద్రాలను బుధవారం సందర్శించి, తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వాన కాల సీజన్ కావడంతో రైతులు పంటలకు ఎరువులు వినియోగిస్తారని, సరియైన ధరలకు ఎరువులను రైతులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ సుకినె రాజేశ్వర్‌రావు, సీఈవో సోమ ఓంకార్, సిబ్బంది మద్దెల సిబ్బంది, చొప్పరి రజిని కుమార్ పాల్గొన్నారు.

బల్దియా బదిలీల్లో అవకతవకలు

(5వ పేజీ తరువాయి)

పారిశుధ్య విభాగంలో పని చేసిన 8 మంది సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లను బదిలీ చేసి వారి స్థానాల్లో ఇంకా ఎవరిని నియమించకపోవడం వల్ల మిగతా సిబ్బందికి పని భారంగా మారుతుందని సిబ్బంది చెప్పారు. ఇంకా 10 మంది వార్డ్ ఆఫీసర్లకు బల్దియా నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ ఐనా ఇంకా రిలీవ్ కాకుండా ఎమ్మెల్యేలు, అధికారుల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు.

సీడీఎంను కలిసిన బాధితుడు

బల్దియా సీనియర్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియలో తనకు అన్యాయం జరిగిందని ప్రస్తుతం కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఇజ్రాయెల్ ఆవేదన వ్యక్తం చేశాడు. తనకంటే ముందు వెనకాల బదిలీకి అర్హులైన సిబ్బంది ఉన్నా తననే టార్గెట్‌గా చేసి ఖమ్మంకు బదిలీ చేయడం వెనుక కుట్ర దాగి ఉందని వాపోయాడు. రెండు రోజుల క్రితం ఇక్కడ జరిగిన అవకతవకలు, తనకు జరిగిన అన్యాయంపై హైదరాబాద్ ఇన్‌చార్జి సీడీఎంఏ వీపీ గౌతంను కలిసి విన్నవించానని సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తానని చెప్పినట్లు ఇజ్రాయెల్ తెలిపారు.

పోలీసు వ్యవస్థలో మార్పులు తీసుకురావాలి



మాట్లాడుతున్న న్యాయవాది అంబటి శ్రీనివాస్

నర్సంపేట, జూలై 24 : పోలీసు వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం మార్పులు తీసుకురావాలని సీనియర్ న్యాయవాది అంబటి శ్రీనివాస్, బార్ అ సోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాది పుట్టపాక రవి డిమాండ్ చేశారు. పట్టణంలోని కోర్టు ఆవ రణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సంపేట బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది బొట్ల పవన్ నల్లబెల్లి పోలీసు స్టేషన్‌కు మంగళవారం కేసు విషయంలో మాట్లాడేందుకు వెళితే నల్లబెల్లి ఎస్ఐ అమర్యాదగా వ్యవహరించారని వారు పేర్కొన్నారు. న్యాయవాది పవన్ పట్ల నల్లబెల్లి ఎస్ఐ అనుచితంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి కోర్టు విధులను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బహిష్కరించి జడ్జీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. ఏసీపీ, నల్లబెల్లి ఎస్సై న్యాయవాదులతో మాట్లాడాక జడ్జి సమక్షలో నల్లబెల్లి ఎస్సై క్షమాపణ చెప్పారని వారు తెలిపారు. రాష్ట్రంలో ప్రజలపై, న్యాయవాదులపై పోలీసులు అనుచితంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. ప్రజాపాలన అందిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి పోలీసు అధికారులు వ్యవహరిస్తున్న తీరును పట్టించుకోవడం లేదన్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రజలు, న్యాయవాదులు ఇతరులతో స్టేషన్ అధికారులు మర్యాదగా వ్యవహరించేలా ప్రభుత్వం పోలీసు వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు సారంగపాణి, నర్సింహారెడ్డి, రమేశ్‌యాదవ్, మోటూరి రవి, కొడిదెల సంజయ్‌కుమార్ ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



రాయపర్తిలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రాయపర్తి, జూలై 24 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు జన్మదిన వేడుకలు బుధవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కేక్ కట్‌చేసి స్వీట్లు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్, మాజీ రైతు బంధు అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, నాయకులు చెవ్వ కాశీనాథం, మాజీ సర్పంచ్ గారె నర్సయ్య, సుధాకర్, చందు రామ్, ఎల్లస్వామి, సింహాద్రి, ఐత రవి, మధు, నరేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

• దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలు గిర్నిబావిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో శానబోయిన రాజ్‌కుమార్, కాట్ల భద్రయ్య, పొన్నం మొగిలి, మోడెం విద్యాసాగర్, పిండి కుమారస్వామి, కమలాకర్ పాల్గొన్నారు.

• నల్లబెల్లి : నల్లబెల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నేత కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్‌చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఊడుగుల ప్రవీణ్, కొత్తపల్లి కోటిలింగాచారి, నానబోయిన రాజారాం, జన్ను జయరావు, గుమ్మడి వేణు, క్యాతం శ్రీనివాస్, ఆకుల సాంబారావు, బొట్ల ఎల్లస్వామి, పరికి నవీన్ పాల్గొన్నారు.

• నెక్కొండ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలను నెక్కొండలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్‌చేసి మిఠాయిలను పంచిపెట్టారు. అనంతరం బాణాసంచా పేల్చారు. కార్యక్రమంలో నెక్కొండ సొసైటీ చైర్మన్ మారం రాము, నాయకులు కొమ్ము రమేశ్, కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, గుంటుక సోమయ్య, తాటిపల్లి శివకుమార్, కారింగుల సురేష్, బల్ల వెంకన్న, తోట సాంబయ్య, జనార్ధన్, రవి, వీరభద్రయ్య, సారంగపాణి, కృష్ణారావు, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

• వర్ధన్నపేట : బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. వర్ధన్నపేట మాజీ ఎంపీపీ అన్నమనేని అప్పారావు, మాజీ జడ్పీటీసీ మార్గం భిక్షపతి బర్త్‌డే కేక్‌ను కట్‌చేసి పంపిణీచేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ ఎలెందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు గుజ్జ గోపాల్‌రావు, తూళ్ల కుమారస్వామి, తోటకూరి రాజమణి, సిలువేరు కుమారస్వామి, కొండేటి శ్రీనివాస్, ఏరుకొండ వేణుగోపాల్‌రావు, పొనుగోటి చందర్‌రావు, మాధవరావు, ఐత ఎల్లయ్య పాల్గొన్నారు.

భవన కార్మికుల సమస్యలపై రేపు చలో అసెంబ్లీ

నర్సంపేట, జూలై 24 : భవన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం చల్లో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గన్నారపు రమేశ్ అన్నారు. నర్సంపేట పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భవన కార్మికులు ప్రతీ నిత్యం శ్రమచేసి భవనాలను అందంగా నిర్మాణం చేస్తారన్నారు. ప్రతీ కార్మికుడికి ఇన్సూరెన్స్ కార్డులు ఇవ్వాలని, పాత పద్ధతిలో ఆన్‌లైన్‌లో క్లెయిములు అందించాలన్నారు. కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, లేబర్ అడ్డాలు ఏర్పాటు చేయాలన్నారు. 55ఏళ్ల దాటిన కార్మికు డికి రూ.3వేలు పింఛన్ అందించాలన్నారు. పలు డిమాండ్లతో నిర్వహించే చల్లో అసెంబ్లీ కార్యక్రమంలో అధికసంఖ్యలో కార్మికులు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో బురగాని సారయ్య, కనుపోజుల బ్రహ్మాచారి, గోవర్ధన్, యాకూబ్, రవీంద్రచారి, నర్సింహచారి, రాజు, నగేష్, రవి, గోవర్ధన్‌తదితరులు పాల్గొన్నారు.

కుక్క కాటుతో బాలుడికి గాయాలు



పర్వతగిరి, జూలై 24 : కుక్కకాటుతో బాలుడికి గాయాలైన సంఘటన బుధవారం మండల కేంద్రంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాసాని మనోజ్ కుమారుడు విహాన్ ఉదయాన్నే ఇంటిముందు ఆడుకుంటుండగా అటుగా వచ్చిన వీధి కుక్కలు కరవడంతో గాయాలపాలయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు కుక్కలను తరిమివేసి గాయాలైన బాలుడి ని స్థానికంగా ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన చికిత్స కోసం వరంగల్‌కు తరలించారు.

• తిమ్మరాయిన్‌పహాడ్‌లో విద్యార్థికి..



చెన్నారావుపేట : కుక్కల దాడిలో ఓ విద్యార్థి గాయపడ్డ సంఘటన మండలంలోని తిమ్మారాయిన్‌పహాడ్‌లో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. ఇదే గ్రామానికి చెందిన సదిరం శివ అనే విదార్థి ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో కుక్కల గుంపు ఒక్కసారి విద్యార్థి వెంటపడ్డాయి, కుక్కల దాడి నుంచి విద్యార్థి తప్పించుకొనే ప్రయత్నం చేస్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డు ప్రక్కనే ఉన్న సైడ్ కాల్వలో పడిపోయాడు. దీంతో కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గ్రామస్థులు గమనించి విద్యార్థిని ఆస్పత్రికి తరలించారు. కాగా, కుక్కల బెడద నుంచి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

వర్ధన్నపేట రూరల్, జూలై 24 : మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు ఇంటిలోని సామగ్రి దగ్ధం కావడంతో బుధవారం బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు చేయూతగా నిలిచారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఆదేశాల మేరకు బాధితుడు ఎలికట్టె నర్సయ్య కుటుంబానికి 125 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు, దుప్పట్లు, బట్టలతో పాటు రూ.5వేల నగదు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మేరుగు రాజాలు, రమేష్ పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పోస్టర్ల ఆవిష్కరణ

నర్సంపేట టౌన్, జూలై 24 : ఖమ్మం సీపీఐ (ఎంఎల్) కార్యాలయంలో ఈ నెల 28న జరగనున్న రాయల చంద్రశేఖర్ సంతాప సభను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన వాల్ పోస్టర్లను ఆ పార్టీ నాయకులు బుధవారం నర్సంపేట పట్టణంలో ఆవిష్కరించారు. మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు మాట్లాడుతూ భూమి, భుక్తి, దేశ ప్రజల విముక్తి కోసం 50ఏళ్ల తన సుదీర్ఘ ప్రయాణంలో ఏనాడు వెనక్కి తిరిగి చూడని రాయల చంద్రశేఖర్ మరణం విప్లవోద్యమానికి తీరనిలోటన్నారు. ఈ కార్యక్రమంలో జవహర్‌లాల్, మనోహర చారి, లింగన్న, రాజేందర్, శేఖర్, సులోచన పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

దుగ్గొండి, జూలై 24 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంపీడీవో ఆరుంధతి సందర్శించి, తనిఖీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని పిల్లలకు వడ్డించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

పీడీఎస్‌యూ నాయకుడి ముందస్తు అరెస్టు

దుగ్గొండి, జూలై 24 : విద్యారంగ సమస్యలపై బుధవారం అసెంబ్లీ ముట్టడి సందర్భంగా మండలంలోని తిమ్మంపేటకు చెందిన పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్‌ని మంగళవారం రాత్రి దుగ్గొండి పోలీసులు అరెస్టుచేశారు. అజయ్ మాట్లాడుతూ విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయింపు, అన్ని యూనివర్సిటీలకు వీసీలను నియామించాలనే డిమాండ్‌తో పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ అసెంబ్లీ ముట్టడి పిలుపు ఇవ్వగా, అక్రమంగా నాయకులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. కాగా, పోలీసులు బుధవారం సాయంత్రం సొంత పూచికత్తుపై గుర్రం అజయ్‌ని విడుదల చేశారు.

మెరుగైన విద్యుత్ అందించడమే లక్ష్యం

నెక్కొండ, జూలై 24 : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించే లక్ష్యంగా వరంగల్ సర్కిల్ పరిధిలో 74 నూతన కెపాసిటర్ బ్యాంకులు అమర్చినట్లు సూపరింటెండెంట్ ఇంజనీర్ మధుసూదన్ తెలిపారు. బుధవారం నెక్కొండలోని 132/33/11కేవి విద్యుత్ సబ్ స్టేషన్‌లో పనులను పరిశీలించి మాట్లాడారు. వోల్టేజ్‌లో హెచ్చుతగ్గులు లేకుండా కెపాసిటర్ బ్యాంక్‌లు ఉపయోగపడుతాయన్నారు. సబ్ స్టేషన్లలో త్వరలో ఒకటవ, రెండవ ఎంవిఏఆర్ కెపాసిటర్లు, 11కేవీ లైన్లలో 600 కెవిఆర్ కెపాసిటర్లు అమర్చడం పవర్ ఫ్యాక్టర్ మెరుగు పడుతుందన్నారు. ఆధునిక పద్ధతులతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ భారం తగ్గుతుందన్నారు. డీఈ శ్రీధర్, ఏఈ చిరంజీవి, లైన్‌ఇన్స్‌పేక్టర్లు భద్రయ్య, సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించాలి

వర్ధన్నపేట, జూలై 24 : ప్రజలకు మెరుగైన సౌక ర్యాలను అందించాలని వర్ధన్నపేట మండల స్పెషల్ ఆఫీసర్, ఏడీఏ సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం వర్ధన్నపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుధ్య సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. సమీక్ష సమావేశంలో ఎంపీడీవో వెంకటరమణ, తహసీల్దార్ విజయ్‌సాగర్, ఎంపీవో ధనలక్ష్మి, వెటర్నరి అసిస్టెంట్ సర్జన్ రాజేందర్, డిప్యూటీ తహసీల్దార్ వినయందర్ రెడ్డి, ఏపీవో నాగేశ్వర్‌తో పాటు వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు , ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రుణమాఫీలో బ్యాంకర్ల కోత సరికాదు

నల్లబెల్లి, జూలై 24 : రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ చేస్తున్న క్రమంలో బ్యాంకర్లు రైతుల డబ్బులకు కోత పెట్టడం సరికాదని ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు బొట్ల నరేష్ అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేస్తున్న క్రమంలో బ్యాంకర్లు కొంతమంది రైతులు రెన్యూవల్ చేయలేదని రూ.5వేల నుంచి రూ.10వేల వరకు డబ్బులు రైతుల ఖాతా నుంచి కట్‌చేయడం అన్యాయమన్నారు. ఏయే బ్యాంకుల్లో రైతుల డబ్బులు కట్ చేస్తున్నారో అధికారులు గుర్తించాలని సూచించారు. రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోబోమని హెచ్చరించారు.

సర్కారు బడులను అభివృద్ధి పరచాలి

చెన్నారావుపేట, జూలై 24 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి పరచాలని ఏఐఎఫ్‌డీఎస్ వరంగల్ జిల్లా కార్యదర్శి జన్ను రమేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను విద్యార్థి సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేయడానికి అధిక నిధులను కేటాయించాలన్నారు. విద్యార్థులు ఆడుకోవాడానికి కనీసం ప్లేగ్రౌండ్ కూడా లేదన్నారు. తక్షణమే అధికారులు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పాఠశాలను అభివృద్ధి పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టాలి

చెన్నారావుపేట, జూలై 24 : గొల్ల, కురుమలకు రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టాలని జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. ఇప్పటివరకు 4లక్షల మందికే గొర్రెల పంపిణీ చేశారన్నారు. మిగాత 3 లక్షల మందికి గొర్రెలను పంపిణీ చేయాల్సి ఉందన్నారు. గొర్రెల కోసం 80వేల మంది లబ్ధిదారులు రూ.43,730లను డీడీలను తీశారన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో గొల్ల, కురుమలకు నగదు బదిలీ చేయాలన్నారు. ఎలాంటి అవినీతి, అక్రమాలు లేకుండా ప్రభుత్వం పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.


గ్రామ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న గోగుల రాణాప్రతాప్‌రెడ్డి

నల్లబెల్లి, జూలై 24 : గ్రామ స్థాయిలో కార్యకర్తలు బీజేపీని బలోపేతం చేయాలని బీజేపీ జిల్లానాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన బీజేపీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా బీజేపీ కాపాడుతుందన్నారు. కార్యకర్తలు బీజేపీని దైవంగా భావించాలని కోరారు. దేశానికి దిక్సూచిగా నరేంద్రమోదీ పనిచేస్తున్నారని తెలిపారు. బీజేపీతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బొందిరెడ్డి ప్రతాపరెడ్డి, తడుక వినయ్‌గౌడ్, బచ్చు వెంకన్న, పెరుమాండ్ల కోటి, సుధగాని ప్రమోదగౌడ్, కామెర పాపయ్య, బోళ్ల నారాయణ, ఈర్ల నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో ప్రమాద రహిత వారోత్సవాలు



మాట్లాడుతున్న డీఎం ప్రసూనలక్ష్మి

నర్సంపేట టౌన్, జూలై 24: నర్సంపేట ఆర్టీసీ డిపోలో బుధవారం ప్రమాద రహిత వారోత్సవాలు నిర్వహించారు. డీఎం ప్రసూన లక్ష్మి, టౌన్ సీఐ రమణమూర్తి మాట్లాడుతూ డ్యూటీ చేసే డ్రైవర్లు రోడ్డు పరిస్థితులకు అనుగుణంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా డ్రైవింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ భవాని, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రభాకర్, ట్రాఫిక్ సూపర్‌వైజర్ డీఎస్ నారాయణ, వీరారెడ్డి పాల్గొన్నారు.

పల్లె దవాఖానా కిటికీల అద్దాలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

చెన్నారావుపేట, జూలై 24: పల్లె దవాఖానా కిటికీల అద్దాలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కలామ్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎండీ.బాషమీయా అన్నారు. బుధవారం ఉప్పరపల్లి గ్రామంలోని పల్లె దవాఖానాను ఫౌండేషన్ సభ్యులు కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో ఆకతాయిలు చేస్తున్న అగడాలను అరికట్టాలన్నారు.గ్రామంలో పోలీస్ వారు మరింద నిఘాను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పరికి మధుకర్, ఉద్దుల రాజు, పోగుల అశోక్ స్వామి, కుక్కల రాజు, రెడ్డబోయిన ఓదేలు తదితరులు పాల్గొన్నారు.